RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 322 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 డిసెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## ఈ రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వాయుగుండం వల్ల వచ్చే 12 గంటల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఇది దేశవ్యాప్తంగా ప్రభావితం చేస్తుందని వెల్లడించింది. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీతో సహా 8 రాష్ట్రాల్లో భారీ నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో ఏడు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఛాన్స్ ఉండగా, మరో 9 రాష్ట్రాల్లో సాధారణ వర్షం కురిసే అవకాశం ఉంది. కొండ ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయని వెదర్ రిపోర్ట్ అంచనా వేసింది. వాతావరణ శాఖ ప్రకారం నేడు గుజరాత్, సబ్-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, కొంకణ్, గోవా, సెంట్రల్ మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెదర్ రిపోర్ట్ తెలిపింది.

## మోదీ ప్రభుత్వం సంచలనం..

# జమిలికి ఆమోదం!




ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే తన కలను ఎన్డీయే సర్కార్ సాకారం చేసుకోనుంది. ఈ మేరకు జమిలి ఎన్నికలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర తెలపడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఒక దేశం- ఒక ఎన్నిక బిల్లుకు ఆమోద ముద్ర తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను పూర్తిగా ఆమోదం తెలపడం విశేషం. ఆమోదం పొందడంతో ఒక దేశం- ఒక ఎన్నికకు సంబంధించిన బిల్లు ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దేశంలో వేరువేరుగా ఎన్నికలు నిర్వహించడంతో దేశ ప్రగతికి ఆటంకం ఏర్పడుతోందని బీజేపీ వాదిస్తోంది. జమిలి ఎన్నికలకు సంబంధించి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీని 2 సెప్టెంబర్ 2023న ఏర్పాటుచేశారు. 191 రోజుల కసరత్తు అనంతరం ఆ కమిటీ 18,626 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు సమర్పించిన నివేదికలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ రెండు కీలక ప్రతిపాదనలు చేసింది. జమిలి ఎన్నికలు రెండు దశల్లో చేయాలని ప్రతిపాదించింది. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి చేయాలని ప్రతిపాదించగా.. తర్వాత 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేరోజు జరపాలని సూచించింది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతో అభివృద్ధి ప్రక్రియ.. సామాజిక ఐక్యతను ప్రోత్సహించేందుకు.. ప్రజాస్వామ్య పునాదిని మరింత బలోపేతం చేస్తుందని కమిటీ పేర్కొంది. ఏకకాలంలో ఓటింగ్ నిర్వహించడంతో పారదర్శకత, సౌలభ్యం పెరుగుతుందని అభిప్రాయపడింది. ఇక ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, భద్రతా దళాలు కూడా ఎలా వినియోగించుకోవాలో కూడా కమిటీ సూచనలు చేసింది. అయితే జమిలి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అనేది ఆసక్తికరంగా మారింది. మధ్యలో జరుగుతాయా? లేదా మధ్యంతర ఎన్నికలు జరుగుతాయా? అనే ఉత్కంఠ నెలకొంది.



## ప్రకటనలు కాదు.. పథకాల అమలు కావాలి: కేటీఆర్

హైదరాబాద్: సంక్రాంతికి రైతు భరోసా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రకటనలు కాదు పథకాల అమలు కావాలన్నారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొట్టారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కల్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరంటు, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.

# మళ్లీ దద్దరిల్లిన దండకారణ్యం


## 12 మంది మావోయిస్టులు మృతి..



అడవిలో ఒక్కసారిగా అలజడి.. దండకారణ్యం దద్దరిల్లుతోంది.. తుపాకుల మోతలతో రక్తమోడుతోంది. పచ్చని అటవీప్రాంతం ఎరుపెక్కుతోంది..ఇలా ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం వరుస ఎన్‌కౌంటర్లతో రక్తసిక్తమవుతోంది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఏడాది కాలంగా భీకర పోరు జరుగుతోంది. ఈ భీకరపోరులో భారీ సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారు. తాజాగా.. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం తుపాకుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు.

అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య గురువారం ఉదయం ఈ భీకర కాల్పులు జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది.. తెల్లవారుజాము 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని.. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు ఇందులో పాల్గొన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా అడవులను భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి.. గతనెల లోనూ భారీ సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి నుంచి ఇప్పటివరకు దాదాపు ఏడు భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. 200 మందికి పైగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.

**అక్టోబర్ నెలలో భారీ ఎన్‌కౌంటర్..** చత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ- నారాయణపూర్ సరిహద్దులోని అబూజ్‌మాఢ్ అటవీప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఏకంగా 38మంది మావోయిస్టులు హతమవడంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దేశంలోనే అతిపెద్ద ఎన్‌కౌంటర్‌గా రికార్డ్‌లకెక్కింది. ఇటీవల జరిగిన ములుగు ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు.. ఇలా వరుస ఎన్‌కౌంటర్లతో అటవీ ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది..



## మంత్రి పదవి

# టెన్షన్... టెన్షన్...

# దక్కేదెవరికో?

# మంత్రివర్గంలోకి ఆ ముగ్గురు?

## రాహుల్‌తో మంతనాలు

# ఆశావహుల్లో టెన్షన్!

హైదరాబాద్ : త్వరలోనే మరో ముగ్గురిని రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఈనెలలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందా? లేదా? అని కొందరు సీనియర్ నేతలు ఇప్పటికే ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ హైకమాండ్ మంత్రివర్గ విస్తరణకు ఓకే చెబితే ఎంత మందికి చాన్స్ ఇస్తారనే దానిపైనా నేతల్లో టెన్షన్ నెలకొన్నది. లిస్టులో తమ పేరు ఉంటుందా? ఉండదా? అని అంతర్గత ఎంక్వైరీ చేస్తున్నట్టు టాక్. ప్రస్తుతం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో ఉన్నారు. వీరిరువురు నేతలు రాహుల్ గాంధీతో సమావేశమయ్యాక కేబినెట్ విస్తరణపై క్లారిటీ వస్తుందని ఏఐసీసీతో సన్నిహితంగా ఉండే సీనియర్లు లీకులు ఇచ్చినట్లు తెలుస్తున్నది. రేపటి వరకు సీఎం, డిప్యూటీ సీఎం రేపటి వరకు ఢిల్లీలోనే ఉండనున్నారు. ఒకవేళ ఏదైనా కారణంతో కేబినెట్ విస్తరణ ఇప్పుడు కుదరకపోతే స్థానిక ఎన్నికల తర్వాత తప్పక ఉంటుందని పార్టీ నేతల అంచనా. దీంతో మంత్రి వర్గ విస్తరణపై ఆశావహుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది.

**పదిరోజుల్లోనే?...** కేబినెట్ విస్తరణ డిసెంబరులో కుదరకపోతే లోకల్ బాడీ ఎన్నికల తర్వాతే ముహూర్తం ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. సీఎం రేవంత్ మాత్రం ఈ పది రోజుల్లో కేబినెట్ విస్తరణ చేపట్టి లోకల్ బాడీ ఎన్నికలకు వెళతారని సమాచారం. అందుకోసం ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలోనే కేబినెట్ విస్తరణపై రాహుల్ గాంధీతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తున్నది. మరోవైపు ఈనెల 22లోపు మాత్రమే మంచి రోజులు ఉన్నాయని టాక్ వినిపిస్తున్నది. 'కేబినెట్ విస్తరణ ఉంటే ఈ పది రోజుల్లోనే ఉండాలి. ఆ తర్వాత సంక్రాంతి వరకు కీడు దినాలుగా భావిస్తుంటారు. ఆ టైంలో నిర్ణయాలు తీసుకోరు. ఏం ఉన్నా 22లోపు మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే లోకల్ వార్ తర్వాతే' అని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ లీడర్ అభిప్రాయపడ్డారు. సంక్రాంతి అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికల హడావుడి ప్రారంభం కానుంది. ఆ టైంలో కేబినెట్ విస్తరణ చేస్తే కొత్త సమస్యలు వచ్చే అవకాశమున్నది పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

**ఇప్పుడు పాక్షికమే?..** హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ముగ్గురు లేదా నలుగురికి మాత్రమే చాన్స్ దక్కనుందని సమాచారం. మిగతా ఖాళీలను పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉందని టాక్. సామాజిక సమీకరణ కూర్పు కుదరకపోవడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఎందుకంటే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం అధికంగా పోటీ పడుతున్నారు. ఎవరిని తీసుకున్నా మిగతా వారు అలకపాన్పు ఎక్కే చాన్స్ ఉన్నది. అందుకే ఒక ఓసీ, ఒక బీసీ, ఒక మైనార్టీ, వీలైతే ఎస్టీ వర్గం నుంచి ఒకరిని కేబినెట్‌లోకి తీసుకుంటారని తెలుస్తున్నది. ఈసారి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డిని పక్కాగా కేబినెట్‌లోకి తీసుకుంటారని సమాచారం. అలాగే, బీసీ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి, మైనార్టీ నుంచి ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌తో పాటు ఎస్టీ వర్గానికి చెందిన ఒకరికి చాన్స్ దక్కుతుందని టాక్.

**తలనొప్పిగా మారిన 'రెడ్డి ఎమ్మెల్యేలు'..** మంత్రి పదవుల కోసం రెడ్డి ఎమ్మెల్యేలు చాలా మంది పోటీ పడుతున్నారు. ఇప్పటికే ఆ వర్గం వారికి రేవంత్ ప్రయారిటీ ఇస్తున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి టైంలో ఆ వర్గం వారినే మరోసారి కేబినెట్‌లోకి తీసుకుంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం భావిస్తున్నట్టు సమాచారం. అందుకే రెడ్డి సామాజిక వర్గం నుంచి ఒకరికి మాత్రమే ఈసారి చాన్స్ దక్కనుందని టాక్. మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న రెడ్డి ఎమ్మెల్యేల లిస్టులో ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పద్మావతి రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్ రెడ్డి సైతం ఉన్నారు. ఇక ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, అన్నదమ్ములైన వినోద్, వివేక్ సైతం కేబినెట్ బెర్త్ కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది.

# సంపాదకీయం

## బాలయ్య చేసిన పాపమేంటి ?

ఎన్టీఆర్ సినీ లెగసీని కాపాడుతూ గత అయిదు దశాబ్దాలుగా టాలీవుడ్ లో తనదైన శైలిలో సినిమాలు చేస్తూ రాణిస్తూ వస్తున్న నందమూరి బాలకృష్ణ రాజకీయంగానూ తన సత్తాను చూపిస్తూనే ఉన్నారు. సినీ రంగంలో ఎవరికీ దక్కని విధంగా వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య హిందూపురాన్ని నందమూరిపురంగా మార్చేశారు. ఎన్ని పనులు ఉన్నా ఎంతగా షూటింగ్ ఇతరత్రా బిజీగా ఉన్నా కూడా బాలయ్య హిందుపురం ప్రజలకు అందుబాటులోనే ఉంటూ వస్తున్నారు. వారిని ఆయన ఆదుకుంటూ ఎమ్మెల్యేగా తన బాధ్యతలను నెరవేరుస్తున్నారు. అందుకే ఆయనకు ప్రతీ ఎన్నికకూ మెజారిటీని పెంచుతూ జనాలు కూడా తమదైన తీర్పుతో అభిమాన నీరాజనం అందిస్తున్నారు. మరి బాలయ్య తండ్రి ఎన్టీఆర్ సీఎం. అన్న హరి క్రిష్ణ మంత్రిగా ఆరు నెలల పాటు చేశారు. సొదరి పురందేశ్వరి కేంద్ర మంత్రిగా చేశారు. తన వెనక వచ్చిన మేనల్లుడు లోకేష్ మంత్రి అయిపోయారు. ఇక సినీ ఫీల్డ్ లోనూ రాజకీయాల్లోనూ తన వెనక వస్తున్న వారు అంతా మంత్రులుగా కీలక స్థానాలలో ఉంటున్నారు. మరి బాలయ్య ఏమి పాపం చేశారు అని ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాక్ టూ బ్యాక్ బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచిన సమర సింహారెడ్డి నరసింహనాయుడు మూవీస్ శత దినోత్సవ వేడుకలు జరిగినపుడు కాబోయే సీఎం బాలయ్య అని అభిమాన జనం కేరింతలు కొట్టేది. ఆనాడు బాలయ్య ఇమేజ్ అలాంటి రేంజిలో ఉండేది. ఆయన రావాలే కానీ రాజకీయాల్లోకి సీఎం అయి తీరుతారు అని అభిమానులు బలంగా నమ్మేవారు. తండ్రి స్థాపించిన పార్టీ సిద్ధంగా ఉంది. బాలయ్యకు సినీ క్రేజ్ ఎలాగూ ఉంది. దాంతో ఆయన రాజకీయ ఎంట్రీ ఇస్తే చాలు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్న భావనలో ఫ్యాన్స్ ఉండేది. ఇదంతా 2001 నాటి ముచ్చట్లు. అలాంటిది బాలయ్య 2004, 2009లలో పోటీ చేయలేదు. ఆ రోజులలో టీడీపీ కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంది. 2014లో మాత్రం బాలయ్య పోటీ చేయడమే కాదు గెలిచారు. పార్టీ కూడా విజయం సాధించింది. అపుడు అంతా అన్న మాట ఒక్కటే బాలయ్య కీలక శాఖలకు మంత్రి అవుతారని. కానీ జరిగింది వేరు. అయిదేళ్లు ఆయన ఎమ్మెల్యే గానే ఉండిపోయారు. కట్ చేస్తే 2019 ఎన్నికలు. వైసీపీ ప్రభజనంలో అంతా ఓటమి పాలు అయినా బాలయ్య గెలిచి సత్తా చాటారు. అయితే విపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. ఇక 2024 లో అయితే టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించింది. బాలయ్యకు ఈసారి బంపర్ ఆఫర్ ఖాయమని అంతా అనుకున్నారు. కానీ మంత్రి వర్గంలో ఆయన పేరు లేదు. అది అభిమానులకు నిరాశనే కలిగించింది. ఇపుడు చూస్తే మంత్రి మండలిలో నాగబాబు కూడా ప్రవేశిస్తున్నారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చారని ఎవరూ తప్పు పట్టడం లేదు. కానీ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉంటూ తన తండ్రి స్థాపించిన పార్టీకి గత నాలుగు దశాబ్దాలుగా అలుపెరకుండా సేవ చేస్తూ వస్తున్న బాలయ్య మంత్రి పదవికి తగడా అన్నదే ఆయన అభిమానుల ఆవేదనగా ఉంది అని అంటున్నారు. వారూ వీరూ చాలా మంది మంత్రులు అయ్యారు. మరి అన్ని అర్హతలు ఉండి కూడా బాలయ్యకు ఎందుకు మంత్రి పదవి దక్కడంలేదు అన్న ప్రశ్నలు ఉన్నాయి. పోనీ ఫ్యామిలీ ప్యాక్ అని అనుకున్న అందరికీ అలాంటి ప్యాక్ నే అమలు చేస్తున్నారు కదా. ఆ విధంగా చూస్తే నందమూరి కుటుంబానికి మంత్రి పదవి ఏదీ అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఎపుడో 1995 ప్రాంతంలో హరిక్రిష్ణ ఆరు నెలల మంత్రి చేశారు. నాటి నుంచి నందమూరి కుటుంబం అధికారానికి దూరంగానే ఉంటూ వస్తోంది అని అంటున్నారు. మరి అందరి విషయంలో పనిచేయని ఈ ఫ్యామిలీ ఈక్వేషన్స్ బాలయ్యకు మంత్రి పదవి ఇస్తేనే పనిచేస్తాయా అన్న ప్రశ్నలు కూడా ఉన్నాయి.

# సీఎం కప్ మండల స్థాయిలో కోకో పోటీల్లో అలియాబాద్ గ్రామ జట్టు గెలుపొంది, జిల్లా స్థాయికి ఎదగడం అభినందనీయం...

### కాంగ్రెస్ పార్టీ శామీర్పేట మండల యూత్ అధ్యక్షుడు బండి శ్రీకర్ రెడ్డి.



శామీర్పేట (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామ కోకో జట్టు సీఎం కప్ మండల స్థాయి పోటీల్లో గెలుపొంది, సీఎం కప్ జిల్లా స్థాయిలో క్రీడల్లో ఎన్నికవ్వడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ శామీర్పేట మండల యూత్ అధ్యక్షుడు బండి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మజీద్పూర్ గ్రామ పరిధిలోని జైన్ హెరిటేజ్ పాఠశాల మైదానంలో నిర్వహించిన 18 సంవత్సరాలలోపు క్రీడాకారులతో సీఎం కప్ మండల స్థాయి కోకో, వాలీబాల్, కబడ్డీ పోటీలను మండల ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో మొత్తం 270 మంది వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇక కోకో పోటీల్లో అలియాబాద్ గ్రామ జట్టు, మజీద్పూర్ గ్రామ జట్టు ఫైనల్ లో ఇరు జట్లు తలపడగా... అలియాబాద్ గ్రామ జట్టు మండల స్థాయి కోకో పోటీల్లో గెలిచి జిల్లా స్థాయికి సీఎం కప్ క్రీడా పోటీలకు ఎన్నికయింది. ఇక అదే విధంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుండి ఒక్కో విద్యార్థి క్రీడాకారుడు సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు తోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని క్రీడలను సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారు.

## అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగిన లాల్ గడి మలక్ పేట




శామీర్ పేట (గరుడ వార్త) : అయ్యప్ప స్వామి నామ శరణఘోషతో గ్రామం పులకరించింది. శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట గ్రామానికి చెందిన సుమారు 25 మంది అయ్యప్ప మాల ధారణ స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమలకు బుధవారం బయలుదేరా రు. మలక్ పేట గ్రామానికి చెందిన 25 మంది అయ్యప్ప స్వాములకు సత్యం గురుస్వామి ఇరుముడులు కట్టగా ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల యాత్రకు తరలి వెళ్లారు. స్వాములు శబరిమలకు తరలి వెళ్తుండడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఇరుముడి కట్టుకునే వరకు ఆ ప్రాంతం అయ్యప్ప నామస్మరణ శరణు ఘోషతో దద్దరిల్లింది.

## భారతీయ భాషా ఉత్సవ్‌లో అలరించిన చిన్నారుల వేషధారణ....




శామీర్ పేట, (గరుడ వార్త) : ఘనంగా భారతీయ భాషా ఉత్సవం ను సెయింట్ మేరీ సెంట్రల్ పాఠశాలలో నిర్వహించారు. బుధవారం శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో సుబ్రమణ్య భారతి జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తిరుపతిరెడ్డి బహుభాషల యొక్క ప్రత్యేకత లను విద్యార్థులకు వివరించాడు. పాఠశాల కరెస్పాండెంట్ ఎల్లు వరప్రసాద్ రెడ్ మాట్లాడుతూ దేశ సంస్కృతి గొప్పతనం గురించి తెలిపారు. సాహిత్య సంప్రదాయం భాష వల్లనే నని, భిన్నత్వంలో ఏకత్వం చాటాలని విద్యార్థులకు వివరించారు. చిన్నారులు తమ వేషధారణలో వివిధ భాషల ప్రత్యేకతను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీలు గ్రేస్ రెడ్డి, గౌసియా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన వసతులే లక్ష్యం



పరిగి : జిల్లా సమగ్రాభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో అభివృద్ధి మరింత వేగిరంగా చేపట్టి ప్రజల ఇబ్బందులను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈక్రమంలోనే ఇటీవల వికారాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (వుడా) ఏర్పాటు చేయగా మరో ముందడుగు కింద తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా సమయంలో వికారాబాద్‌కు తగిన ప్రాధాన్యం రాలేదు. దీంతో నేటికీ ప్రజలు మౌలిక సదుపాయాల లేమితో అవస్థలు పడుతున్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏర్పాటైందే వుడా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు విడుదల కానుండటంతో అభివృద్ధి పట్ల ఆశలు రేకెత్తుతున్నాయి.

**ఒనగూరే ప్రయోజనాలు**

ప్రధాన ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల ఉన్న గ్రామాలపై నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా పనిచేసేందుకు అవకాశం. సమాన స్థాయిలో పనులు జరగడంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడేందుకు దోహదం. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో వివిధ ప్రాజెక్టులు మంజూరయ్యే అవకాశముంది. కేంద్రం నుంచి అధిక నిధులు మంజూరవతాయి. చిన్న చిన్న పరిశ్రమల రాకతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు చెబుతున్నారు. పాలనా పరమైన కొత్త వ్యవస్థలు, విధానాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

నియోజకవర్గాలు– 4
మండలాలు– 20
పంచాయతీలు – 566
జనాభా – 12.5లక్షలు
అథారిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలు– 493

కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్

వుడా కమిటీని ప్రభుత్వం తాత్కాలికంగా ఐదుగురి సభ్యులతో ఏర్పాటు చేసింది. ఇందులో కలెక్టర్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ ఛైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మిగతా ముగ్గురిలో ప్రత్యేక చీఫ్ సెక్రెటరీ, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ కొనసాగుతారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్ పాత మున్సిపాలిటీలు ఉండగా పరిగి, కొడంగల్ ప్రాంతాలు పంచాయతీ హోదా నుంచి పుర స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం నాలుగింటిని కూడా అథారిటీలో చేర్చారు.


**రూపురేఖలు మార్చేస్తాం** – టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి.

వుడా ఏర్పాటుతో జిల్లా సమగ్రాభివృద్ధికి చక్కటి అవకాశం కలిగింది. ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయి.

ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం. సీఎం ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యపడింది. పరిగి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం.

## కదలని ధాన్యం.. అన్నదాత దైన్యం

కొత్తపల్లి : జిల్లాలో ఈ వానాకాలంలో 2.9 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. సుమారు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశారు. మొత్తం 324 కొనుగోలు కేంద్రాలకు 316 చోట్ల ప్రారంభించారు. సుల్తానాబాద్, ధర్మారం, ఎలిగేడు మండలాల్లో 16 చోట్ల మినహా ఎక్కడా కొనుగోళ్లు మొదలవలేదు. చాలా గ్రామాల్లో కేంద్రాల్లో ఆరబోసి రోజుల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారు. కేంద్రాల్లో సుమారు 5 వేల టన్నుల ధాన్యం ఆరబోసినట్లు అధికారులు చెబుతున్నా వాస్తవానికి అంతకు రెట్టింపు మొత్తంలో ఉంటుంది. ఇప్పటివరకు 200 టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారులు



పేర్కొంటున్నారు.

ఎందుకు ఈ పరిస్థితి!

కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయమై స్పష్టత కొరవడింది. గతంలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద బియ్యం ఇవ్వని మిల్లులను ఈసారి బ్లాక్ లిస్టులో పెట్టారు. వారి నుంచి బ్యాంకు గ్యారంటీని ప్రభుత్వం కోరింది. పూచీకత్తు విషయమై జాప్యం నెలకొనడంతో ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఓపీఎంఎస్)లో సమస్య తలెత్తింది. మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోవడంతో లారీలు అక్కడే నిలిచిపోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు చర్చిస్తుండటంతో కొందరు మిల్లర్లు పూచీకత్తు ఇవ్వడానికి ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారం

– శ్రీకాంత్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించాం. మిల్లర్ల బ్యాంకు పూచీకత్తుకు సంబంధించి ఆన్‌లైన్ అనుమతికి జాప్యం నెలకొంది. మిల్లర్లతో కలెక్టర్ చర్చించడంతో అంగీకరించారు. ఒకట్రెండు రోజుల్లో ఆన్‌లైన్ సమస్య పరిష్కారమవుతుంది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాం. ఎక్కడా తడిసిపోలేదు.

పది రోజులుగా ఇక్కడే.. – కలవేన మల్లేశ్, కొత్తపల్లి, పెద్దపల్లి మండలం

ఏడున్నర ఎకరాల్లో వరి సాగు చేశా. పది రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ఆరబోస్తున్నా. నిర్ణీత తేమ శాతం వచ్చింది. రెండు రోజులుగా అకాల వర్షాలకు తడిసిపోకుండా పరదాలు కప్పుతున్నా. పొద్దంతా కల్లంలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వానలే.. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం..!

హైదరాబాద్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి శ్రీలంక, తమిళనాడు తీరం దిశగా పయనిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ నెల 13 వరకు అకడకడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. 14న లేదా 15న మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు అంచనా వేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు.

# దశబ్దాల కల.. నెరవేరిన వేళ

మంథని: మంథనిలోని గోదావరిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపనతో ఈ ప్రాంతవాసులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. మంథని.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం శివ్వారం మధ్య గోదావరి నదిపై వంతెన నిర్మించాలని స్థానికులు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అప్పుడు ముందడుగు పడలేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.125 కోట్లు మంజూరు చేయగా.. ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**తగ్గనున్న దూరాభారం**

మంథని నుంచి చెన్నూరుకు వెళ్లాలంటే గోదావరిఖని మీదుగా 70



కిలోమీటర్లు ప్రయాణించాలి. నాలుగేళ్ల క్రితం గోదావరిపై సుందిళ్ల బ్యారేజి నిర్మాణంతో 20 కి.మీ దూరం తగ్గింది. కొందరు మంథనిలోని గోదావరిలోంచి పడవలపై వెళ్లేవారు. ఎండాకాలంలో అయితే నీరుతగ్గడంతో మట్టి రోడ్డు వేసి ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో సమృద్ధిగా నీరు ఉండటంతో 2020 నుంచి పడవలపైన వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వంతెన పూర్తయితే మంథని నుంచి చెన్నూరుకు 35 కి.మీ దూరాన్ని గంటలో చేరుకోవచ్చు. మంథని–చెన్నూరు మధ్య రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లావాసులు చెన్నూరు మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వెళ్లే వెసులుబాటు కలుగుతోంది. **అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు మొదలు-జాఫర్, రోడ్ల, భవనాల శాఖ డీఈఈ**

మంథనిలోని గోదావరిపై వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. శివ్వారం మొసళ్ల అభయారణ్యం రక్షిత ప్రాంతం పరిధిలో ఉండడంతో అటవీశాఖ అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. పర్యావరణ శాఖ అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

# ఆందోళన వీడు.. విజయం సాధించు!

కరీంనగర్ : గోదావరిఖని ప్రాంతానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి భయానికి గురవుతూ, చదవలేకపోతున్నానంటూ ఆందోళనకు గురవుతున్నాడు. కుటుంబ సభ్యులు మానసిక వైద్యులను సంప్రదించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వైద్య విద్యార్థి ప్రథమ సంవత్సరంలోనే తనకు భయమేస్తోందని, చదవడం తనతో కావడంలేదని ఆందోళనకు గురవుతున్నాడు. గమనించిన తల్లిదండ్రులు అతన్ని మానసిక వైద్యులకు చూపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరీక్షలు సమీపించగానే చాలామంది విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కెరీర్, భవిష్యత్తు నిర్ణయించే ఇంటర్ విద్యాభ్యాసంలో వారిని ఆలోచనల్లో ముంచెత్తుతాయి. కళాశాలల యజమానులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ర్యాంకుల భారాన్ని మోపుతున్నారు. ముందున్న లక్ష్యాలను సాధించేందుకు వారు పుస్తకాలకు పరిమితం కావాల్సిన పరిస్థితి. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల ధోరణులను నివారించేందుకు ప్రభుత్వం 'టెలిమానస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 14416ను ఏర్పాటు చేసింది.

**ప్రశాంతతతో ప్రయత్నించాలి..**

ర్యాంకులు, సీట్ల కోసం విద్యార్థులు రాత్రింబవళ్లు చదువుతుంటారు. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా వాటిపైనే ప్రధాన దృష్టి సారిస్తున్నాయి. కొందరు విద్యార్థులు ముందున్న లక్ష్యాలను సాధిస్తామో లేదో అనే భయంతో చదవలేకపోతుంటారు. ఒత్తిళ్లు తట్టుకోలేక, చదవలేక మానసిక ధైర్యాన్ని కోల్పోతుంటారు. కొందరు తల్లిదండ్రులు ఈ కారణాలతో మానసిక వైద్యులను సంప్రదిస్తున్నారు. బాగా చదివే వారు కూడా మానసిక ఒత్తిళ్లతో ఆశించిన ఫలితాలకు దూరమవుతుంటారు. జిల్లాలో చాలామంది తల్లిదండ్రులు ఫలితాలపైనే ధ్యాస నిలుపుతున్నారు తప్ప విద్యార్థుల ఆరోగ్యం, మానసిక పరిస్థితులను పట్టించుకోవడంలేదు. అపజయం ఎదురైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చనే ఆత్మవిశ్వాసాన్ని పిల్లల్లో నింపాల్సిన అవసరముంది.

**24 గంటలు..**

టెలిమానస్ టోల్‌ఫ్రీ నంబరు 24 గంటలు పని చేస్తుంది. మానసిక ఒత్తిడికి గురవుతున్న వారితోపాటు ఎలాంటి సమస్యలున్నా విద్యార్థులు ఆ నంబరుకు ఫోన్ చేయొచ్చు. విద్యార్థులు టెలిమానస్‌లోని మానసిక నిపుణులతో సంభాషిస్తే వారు పరిష్కార మార్గాలు, సానుకూల ఆలోచనలు సూచిస్తారు. సమస్యలు తెలుసుకొని, వాటిని అధిగమించే మార్గాలను వివరిస్తారు. ముఖ్యంగా పరీక్షల ఫోబియాను దూరం చేస్తారు. పరీక్షలు, చదువుల విషయంలో ఒత్తిడికి గురైన వారికి, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి మనోధైర్యాన్ని కల్పిస్తారు. తల్లిదండ్రులు కూడా సంప్రదించి విద్యార్థులకు ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మానసిక వైద్య నిపుణులు కూడా ఈ కార్యక్రమంపై ప్రచారం చేస్తున్నారు.

**తల్లిదండ్రులు అర్థం చేసుకుంటేనే..- డాక్టర్ ఎల్.వర్షి, మానసిక వైద్యుడు, కరీంనగర్**

పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు చూడాలి. వారిలో వచ్చే మార్పులను గ్రహించి, దానికి తగ్గట్టుగా ప్రతిస్పందించాలి. ఆందోళన ఆలోచనలు తగ్గించాలి. చదివితే మంచి ఫలితాలు వస్తాయనే ధోరణితో సన్నద్ధమవ్వాలి. మరో ప్రయత్నం ఉంటుందనే ఆలోచనను గుర్తు పెట్టుకోవాలి. చదివేందుకు ప్రణాళిక వేసుకోవాలి. ప్రకారం చదవాలి. మానసిక ఒత్తిళ్లు, ఆందోళనకు గురయ్యే విద్యార్థులను తల్లిదండ్రులు మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. **టెలిమానస్‌కు విస్తృత ప్రచారం- జగన్‌మోహన్ రెడ్డి, కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్యాధికారి**

పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిళ్లను జయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలిమానస్‌ను వారు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రత్యేకంగా సైక్రియాటిస్టు ద్వారా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ఒత్తిడిని జయించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలు కూడా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలి.

# వరద కాలువ మట్టి తరలిపోతోంది



గంగాధర : ఎస్సారెస్పీ కాలువలకు ఆనుకొని ఉన్న మట్టికట్టపై అక్రమార్కులు కన్నేశారు. వరద కాలువకు రక్షణగా ఉండాల్సిన మట్టిని రాత్రనక, పగలనక దోచేస్తున్నారు. ఎవరు అడగరనే ధీమాతో కొల్లగొడుతున్నారు. గంగాధర, రామడుగు, మల్యాల, బోయినపల్లి మండలాలతోపాటు చాలా ప్రాంతాల్లో రేయింబవళ్లు ఇదే పనిగా విలువైన మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంలో ఏ మతలబు ఉందోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లా రైతులకు వరప్రదాయనిగా ఉన్న వరదకాలువ అక్రమార్కులకు వరంగా మారింది. జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వివిధ గ్రామాల మీదుగా 137 కి.మీ పొడవునా వరద కాలువకు ఇరువైపులా ఉన్న కట్టలకు రక్షణ కొరవడుతోంది. ఆయా గ్రామాలకు ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో 60 అడుగుల నుంచి 100 మీటర్ల వరకు స్థలం ఉండగా ఎత్తైన మట్టి కట్టలున్నాయి. కాలువ నిర్మాణ సమయంలో తీసిన మట్టి ఇరువైపులా పోయడంతో కాలువకు రక్షణగా ఉంటున్నాయి. నీటి ప్రవాహానికి అండగా ఉండే ఇవి కాలక్రమేణా రూపు కోల్పోతున్నాయి.

**బండరాళ్లనూ వదలడం లేదు..**

కాలువ తవ్వే సమయంలో కొన్నిచోట్ల రాతిపొరలు వచ్చాయి. వాటిని పగులగొట్టి కరకట్టల వెంట పటిష్ఠతకు కుప్పలుగా పోశారు. మిగిలిన వాటిని ఎక్కడికక్కడే వదిలేశారు. ఇప్పుడు వాటిపై క్రషర్ వ్యాపారులతోపాటు అక్రమార్కుల కన్ను పడింది. రాళ్లు తరలించి కంకరగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. కురిక్యాల, న్యాలకొండపల్లి, తాడిజెర్రి, రంగారావుపల్లి గ్రామాల్లోని వరద కాలువకు చాలాచోట్ల రాళ్లు తరలించి మట్టిని వదిలేశారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేస్టేషన్ పనులు కొత్తపల్లి సమీపంలో జరుగుతుండగా ప్రభుత్వ పనులకు కొన్ని నెలలుగా ఇక్కడి నుంచి బండరాళ్లు తరలిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులూ బండరాళ్లు తరలిస్తూ ఇళ్ల నిర్మాణానికి అమ్ముకుంటున్నారు. బండరాళ్లు, మట్టి తరలించగా ఏర్పడ్డ ఖాళీ స్థలాలను సమీపంలోని కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు.

**ఆదాయానికి గండి..**

నిబంధనల మేరకు ఎక్కడైనా మట్టి తవ్వాలంటే భూగర్భగనుల శాఖతోపాటు సాగునీటి, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ దీన్ని ఉల్లంఘించి కాలువ మట్టిని కొల్లగొడుతున్నారు. జలవనరులు, భూగర్భ గనుల శాఖ సూచించిన మేరకు చలానా చెల్లించాల్సి ఉన్నా నిబంధనలు పాటించడం లేదు. కొంత రుసుం నామమాత్రంగా చెల్లించి అధిక మొత్తంలో మట్టి తరలిస్తున్నారు. వాస్తవానికి కాలువ పక్కన మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వడమనేది కుదరదు. కానీ కరీంనగర్, రేకుర్తి, కొత్తపల్లి పట్టణాలతోపాటు గంగాధర, రామడుగు, ఇతర ప్రాంతాల్లోని స్థిరాస్థి వ్యాపారంలో భాగంగా వెంచర్లతోపాటు కొత్తగా చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి మట్టి తరలిస్తున్నారు. స్థానికంగానైతే టిప్పర్ మట్టికి రూ.2500 వసూలు చేస్తుండగా దూరప్రాంతాలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు.

గంగాధర, రామడుగు, మల్యాల, బోయినపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న పదుల సంఖ్యలో ప్రదేశాల్లో దోచినకాడికి దోచుకుంటూ ముందుకెళ్తున్నారు. ఫిర్యాదు చేసినా ప్రయోజనంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. **నిఘా ఏర్పాటు చేస్తాం – శ్రీనివాస్ గుప్తా, ఈఈ నీటిపారుదల శాఖ** కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేమార్గానికి మాత్రమే బండరాళ్లు, మట్టి తరలించేందుకు అనుమతులిచ్చాం. జలవనరుల శాఖ స్థలంలోని మట్టి, రాళ్లు తవ్వి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. మా శాఖ తరపున అధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నాం. రాత్రిపూట అక్రమ రవాణాకు తెరదీస్తే స్థానికంగా ఉన్న రైతులు సమాచారం అందించాలి.

# మైదానాలు ఇలా.. ఆటలెలా



మెట్‌పల్లి : విద్యార్థులు, యువతకు చదువుతోపాటు మానసికోల్లాసం, శరీర దారుఢ్యానికి క్రీడలు అవసరం. ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా క్రీడా వసతులు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. క్రీడల్లో రాణించాలనే పట్టుదల, సంకల్పం యువతలో ఉన్నప్పటికీ అందుకు తగ్గ క్రీడా మైదానాలు, శిక్షకులు లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. క్రీడలకు అరకొర నిధులు కేటాయిస్తూ వదిలేస్తున్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో మినిస్టేడియాలు మంజూరుచేస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మినిస్టేడియం నిర్మాణ పనులు ప్రారంభమై కొన్ని చోట్ల పాక్షికంగా మరికొన్ని చోట్ల 90 శాతం పూర్తయ్యాయి. ధర్మపురి పట్టణంలో ఇంతవరకు పనులే ప్రారంభం కాలేదు. జిల్లాలో మినీ స్టేడియాల స్థితిగతులపై పరిశీలన కథనం.

**ఎనిమిదేళ్లుగా నిరుపయోగం**

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో 8 ఏళ్ల కిందట రూ.1.60 కోట్లు వెచ్చించి మినీ స్టేడియం నిర్మించారు. 07 జూన్ 2021న అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. స్టేడియంలో క్రీడా పరికరాలను సమకూర్చడంలో యువజన, క్రీడలశాఖ పూర్తిగా విఫలమైంది. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్, క్యారమ్, ఇతర క్రీడా పరికరాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. స్టేడియం కిటికీల అద్దాలు, ముఖద్వారం, ఇతర నిర్మాణాలను ఆకతాయిలు పూర్తిగా ధ్వంసం చేశారు. మినీ స్టేడియం నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో రంగులు వెలిసిపోయాయి.

**నిధులు మంజూరైనా..**

పట్టణంలోని వెంపేట రోడ్డు పక్కన 1998లో మినీ స్టేడియం, ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు, 2009లో క్రీడా పాఠశాలతోపాటు క్రీడాకారులు ఉండేందుకు వసతిగృహం కోసం రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన వసతిగృహంతోపాటు క్రీడా పాఠశాల, షటిల్‌కోర్టు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2022లో స్టేడియం అభివృద్ధి కోసం రూ.50 లక్షలు మంజూరు కాగా మట్టితో వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. క్రీడా పోటీలకు, క్రీడాకారులు ఉండేందుకు ఎలాంటి వసతి లేదు. తాగునీరు కూడా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా**

రాయికల్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరు చేయగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పది ఎకరాల స్థలంలో అయిదెకరాలు కేటాయించి 16 ఫిబ్రవరి 2014న పను ప్రారంభించారు. ఈ నిధులతో క్రికెట్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, టెన్నీస్, కబడ్డీ, కోకో వంటి అవుట్‌డోర్ క్రీడలతోపాటు బాడ్మింటన్, టేబుల్‌టెన్నీస్, చెస్, క్యారమ్ వంటి ఇండోర్ క్రీడలు ఆడేందుకు వీలుగా స్టేడియాన్ని నిర్మించాలి. స్టేడియంలో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. అయిదేళ్లుగా పనులు నిలిచిపోవడంతో అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

**కలగానే మిగిలింది..**

ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.కోటి నిధులు ప్రత్యేక అభివృద్ధి గ్రాంటు ద్వారా మంజూరు చేసింది. టెండర్ల సమయంలో ఎన్నికలు రావడంతో నిలిచి పోయింది. కళాశాల మైదానంలో వందలాది మంది విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు వాకింగ్ చేస్తుంటారు. ఓపెన్ జిమ్ ప్రారంభించినా పరికరాలన్నీ విరిగిపోయాయి. మరోచోట ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి.

**అలంకారప్రాయంగా..**

జగిత్యాల పట్టణంలో క్రీడాభివృద్ధి శాఖ పదేళ్ల కిందట రూ.2.10 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీవివేకానంద మినీ స్టేడియం క్రీడా వసతులు, సౌకర్యాలు లేక అలంకారప్రాయంగా మారింది. శిక్షకుల నియామకం లేక ఈత కొలను శిథిలావస్థకు చేరుకుంటుండగా ఇటీవల విద్యుత్తు దీపాల ఏర్పాటుతో అందుబాటులోకి వచ్చిన షటిల్ బాడ్మింటన్ కోర్టులది ఇదే పరిస్థితి. స్టేడియం ఆవరణలో తాత్కాలికంగా వెలిసిన షెడ్ల స్థానంలో దుకాణ సముదాయం నిర్మిస్తే రూ.లక్షల్లో సమకూరే ఆదాయం ద్వారా క్రీడల అభివృద్ధికి అవకాశం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోకపోవడం క్రీడాకారులకు శాపంగా మారింది.

# చలిలోనూ పెరిగిన విద్యుత్తు వినియోగం

హైదరాబాద్: రాష్ట్రంలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, శీతలగాలులు వీస్తుండటంతో వాతావరణం పొడిగా మారింది. దీంతో విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉంటుందనే అంచనాలకు భిన్నంగా రాష్ట్రంలో కొద్దిరోజులుగా పెరిగింది. గతేడాది నవంబరు 26న 9170 మెగావాట్ల డిమాండ్ ఉంటే.. ఈసారి 10698 మెగావాట్లకు పెరిగింది. గతేడాది నవంబరు 27న 9387 మెగావాట్ల డిమాండ్ నమోదైతే... ఈ ఏడాది ఇదే రోజు 10843 మెగావాట్ల డిమాండ్ రికార్డైంది. వినియోగం డబుల్ సెంచరీ దాటింది.. ఈ నెల 26, 27 తేదీల్లో 200.83, 200.80 మిలియన్ యూనిట్ల వినియోగం రాష్ట్రంలో నమోదైంది.


గతేడాది ఇవే రోజుల్లో 192.37, 195.97 మిలియన్ యూనిట్లు మాత్రమే నమోదైంది. హైదరాబాద్‌లోనూ..విద్యుత్తు డిమాండ్ గతేడాది నవంబరు 26న 2535 మెగావాట్లు ఉండగా.. ఈసారి 2973 మెగావాట్లకు పెరిగింది. నవంబరు 27న గతేడాది 2835 మెగావాట్లు నమోదు కాగా.. ఈసారి 3001 మెగావాట్లకు పెరిగింది. వినియోగంలోనూ పెరుగుదల నమోదైంది. 2023 నవంబరు 26న 49.57 మిలియన్ యూనిట్లు, నవంబరు 27న 53.56 మి.యూ. నమోదైంది. ఈ ఏడాదికి అవే రోజుల్లో 56.56, 56.06 మిలియన్ యూనిట్లు రికార్డైంది. కారణాలేమై ఉంటాయ్... రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య పెరగడం, పరిశ్రమల పరంగా వాడకం, ఉదయం పూట ఇళ్లలో గీజర్ల వినియోగం అధికమవడం వంటి కారణాలతో విద్యుత్తు డిమాండ్ మునుపటి ఏడాది కంటే ఎక్కువగా ఉందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు అన్నారు.

# గొలుసుకట్టు చెరువులు.. ఛిన్నాభిన్నం

ధర్మపురి : పాలకులు, అధికారుల నిర్లక్ష్యం సహజ నీటి వనరులు, వాటి కింది ఆయకట్టును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో గొలుసుకట్టు చెరువులు ఛిన్నాభిన్నంగా మారాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగు నీరందడం లేదు. ముఖ్యంగా ధర్మపురి సమీపంలోని అక్కపల్లి చెరువు, జైన గ్రామంలోని గొలుసుకట్టు చెరువులు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వాన్నంగా మారాయి. మరోవైపు 2022 జులైలో భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు.

**కాలువ నీరు రానికాలంలో ఇవే ఆధారం**

జైన గ్రామంలో ఔసులవానికుంట, రాయికుంట, ఏదులకుంట, చాకిరేవుకుంట, ఎన్నం భీమయ్యకుంట, జక్కులవానికుంట, ఊరచెరువు, చింతల చెరువు, మూలకుంట, బొల్లం రామయ్యకుంటలు ఉన్నాయి. ఇవి ఒకదానిపై ఒకటి అనుసంధానమై ఉన్న గొలుసుకట్టు చెరువులు. ఒక్క చెరువులోకి చేరిన నీరు కాలువల ద్వారా మిగతా చెరువుల్లోకి చేరుతోంది. ఎస్సారెస్పీ కాలువ నీరు రాని కాలంలో ఈ చెరువుల ద్వారా సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందేది. అయితే భారీ వర్షాలకు కాలువలు, తూములు దెబ్బతినడంతో ప్రస్తుతం ఈ వ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. ఈ కుంటలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అలాగే ధర్మపురి పట్టణ సమీపంలోని అక్కపల్లి చెరువు కింద కూడా పది వరకు గొలుసుకట్టు



చెరువులు, కుంటలు ఉన్నాయి. కానీ ఈ చెరువుల కింద కాలువలన్ని పిచ్చిమొక్కలు, పూడికతో కూడుకుపోయి ఉండటంతో నీరు పారడం లేదు. మరమ్మతులు చేస్తే కనీసం రెండువేల ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉంటుంది.

**పిచ్చిమొక్కలు పెరిగాయి సాయినిరెడ్డి, జైన**

జైన పరిధిలో పది చెరువులు ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువలు లేని రోజుల్లో వీటిపైనే ఆధారపడి రైతులు పంటలు పండించే వారు. దురదృష్టవశాత్తు ఈ చెరువులు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక చిన్నాభిన్నంగా మారాయి. కాలువలు మూసుకుపోయి.. పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రభుత్వం వీటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి.

# పల్లె పాలనపై నిర్లక్ష్యం!

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాల్లో రోడ్లపై పిచ్చిమొక్కలు పెరిగి, మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టిసారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

**దోమల స్వైరవిహారం**

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ లోపం కనిపిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టిన అధికారులు గ్రామాల్లో పరిశుభ్రతను విస్మరిస్తున్నారు. మండల కేంద్రంలో చిలుకవాగులో మురుగు ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు, ముఖ్యంగా ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో మురుగుకాల్వలు శుభ్రం, రహదారుల వెంబడి పిచ్చిమొక్కలను శుభ్రం చేయకపోవడంతో దోమలు, దుర్వాసన వెదజల్లుతోంది.– న్యూస్‌టుడే, కొడిమ్యాల

**మురుగుతో దుర్వాసన**

గ్రామాల్లో వార్డులకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో చెత్త సేకరణ, మురుగు కాల్వలు తీయక పోవడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో మురుగు కాల్వలు గతంలో నిర్మించినవే కావడంతో చాలా చిన్నవిగా ఉండి చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. గ్రామశివారులోని కాలనీల్లో మురుగు కాల్వలను నిర్మించకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహించడంతో పాటు నిల్వ ఉంటుండడంతో దుర్వాసన వెదజల్లి, దోమల వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కనే చెత్తను పడేస్తున్నారు.

**కాలువ పూడ్చివేత..**

మండలంలోని పలుగ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగాలేక గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలో అతిపెద్ద మురుగు కాలువ జగ్గని ఒర్రెలో ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో కాలువ అసంపూర్తిగా నిర్మించడంతో మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తుందని కాలనీవాసులు తెలిపారు. కొండగట్టు దిగువ ప్రాంతంలో వనభోజనాలకు వచ్చే యాత్రికులతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. మల్యాల అడ్డరోడ్డు వద్ద కొందరు కాలువను పూడ్చివేయడంతో మురుగు నీరు వెళ్లడంలేదు.

**నిధుల లేమితో..**మండలంలో 32 గ్రామాలు ఉండగా పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో మురుగు కాల్వలను పరిశుభ్రం చేయకపోవడంతో దోమలవ్యాప్తి పెరిగింది. పారిశుద్ధ్య కార్మికులు పరిమితంగా ఉండటంతో గ్రామాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీలకు నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు, వీధి దీపాల నిర్వహణ, క్లోరినేషన్ సరిగా అమలు కావడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

# రూ.135 కోట్లు.. 14 కి.మీలు ... 6వరుసలు

హైదరాబాద్ : నగరంలో కీలక మార్గాల్లో ఒకటైన గండిమైసమ్మ-మియాపూర్ రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. దాదాపు రూ. 135 కోట్ల నిధులతో 14 కి.మీ. వరకు 4 నుంచి ఆరు వరుసలుగా విస్తరించనున్నారు. ఏడాదిలోగా అందుబాటులోకి తెచ్చేలా హెచ్ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పూర్తయితే మల్లంపేట్ వద్ద నిర్మించిన ట్రంప్‌లెట్ నుంచి అవుటర్‌పైకి వెళ్లవచ్చు. గండిమైసమ్మ నుంచి అవుటర్ వైపు వెళ్లేందుకు ఈ మార్గం కీలకం. నాగ్‌పూర్ జాతీయ రహదారి 65తో లింకు ఏర్పడుతుంది.

**అటవీ భూమితో ఆటంకం..** ఈ రహదారి విస్తరణలో మరో అడ్డంకి పొంచి ఉంది. దూలపల్లిలో 2.3 కి.మీ.వరకు అటవీశాఖ భూమి ఉంది. దీనిని హెచ్ఎండీఏకు అప్పగిస్తేనే పనుల్లో వేగం పుంజుకునే వీలుంటుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ అటవీశాఖ దృష్టికి తీసుకెళ్లింది. ప్రత్యామ్నాయంగా అటవీశాఖకు అంతకు సమానమైన భూమి కేటాయించాల్సి ఉంది.

**సమస్య:** ప్రస్తుతం 4 వరుసలుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడు



తోంది.గండిమైసమ్మ నుంచి మియాపూర్ వరకు భారీగా రద్దీ ఉంటోంది. ఉదయం 9 నుంచి 11 వరకు, సా.4 గంటల నుంచి మళ్లీ రాత్రి 8 వరకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

**ప్రయోజనం:** 20 లక్షలమందికి ప్రయోజనం కలుగుతుంది. ఐడీఏ బొల్లారం, బొంతపల్లి, మల్లంపేట్, నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, దుండిగల్, దూలపల్లి, గాజుల రామారం, బౌరంపేట్‌లకు ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బాచుపల్లి కూడలి వద్ద 1.32 కి.మీ.మేరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.

**తొలగింపు... తరలింపు**


రోడ్డుకు ఇరువైపులా 14 కి.మీ.మేర ముఖ్యమైన 1092 చెట్లు ఉన్నట్లు ట్రీ ప్రొటెక్షన్ కమిటీ లెక్కకట్టింది. ఇప్పటికే 603 చెట్లు ట్రాన్స్‌లోకేట్ చేసినట్లు హెచ్ఎండీఏ చెబుతోంది. కొన్ని కొత్వాల్‌గూడ ఏకో పార్కులో, మరొకొన్ని కొత్త పార్కుల్లో నాటనున్నారు.

# విద్యుత్తు బిల్లుల వడ్డన కొందరికే

హైదరాబాద్: కొత్త విద్యుత్తు ఛార్జీల టారిఫ్‌తో నగరంలోని కొన్ని వర్గాలకు స్వల్పంగా విద్యుత్తు బిల్లులు పెరగనున్నాయి. నేరుగా ఛార్జీల రూపంలో కాకుండా పరోక్షంగా స్థిర(ఫిక్సెడ్) ఛార్జీల రూపంలో డిస్కం వడ్డించనుంది. సవరించిన టారిఫ్ ఈనెల ఒకటినుంచే అమల్లోకి వచ్చింది. వచ్చేనెల బిల్లులను కొత్త ఛార్జీల ప్రకారం జారీ చేయనున్నారు. పెంపు భారం రూ.30 కోట్ల వరకు ఉండగా గరిష్ఠంగా నగరంపైనే పడింది.

**టౌన్‌షిప్‌లలో..**

గేటెడ్ కమ్యూనిటీ వర్గాలకు కరెంటు బిల్లులు స్వల్పంగా పెరగనున్నాయి. కిలోవాట్‌కు నెలవారీ ఇన్నాళ్లు రూ.260 స్థిర ఛార్జీలు ఉండగా.. ఇప్పుడు రూ.285కు పెంచారు. ఒక్కో కిలోవాట్‌పై రూ.25 పెరిగింది. ఈ ప్రకారం 1500 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన కనెక్షన్లున్న కమ్యూనిటీలో నెలకు రూ.37,500 బిల్లు పెరగనుంది. ఈ మొత్తాన్ని



రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాలు కమ్యూనిటీలోని వినియోగదారులకు బదలాయించనున్నాయి.

టౌన్‌షిప్‌లకు విద్యుత్తు టారిఫ్ 11కేవీ, 32, 132 కేవీ ఏదైనా యూనిట్‌కు రూ.7.30 వసూలుచేస్తున్నారు. దీన్ని మార్చలేదు.

మెట్రో స్థిర ఛార్జీలు రూ.25 పెంపు

మెట్రో రైలుకు హెచ్‌టీ-5బి విభాగం కింద విద్యుత్తు సరఫరా చేస్తోంది. యూనిట్ రూ.4.95 ఛార్జీలు వసూలుచేస్తోంది. కిలోవాట్‌కు స్థిర ఛార్జీ రూ.475 వసూలు చేస్తుండగా, రూ.500కు పెంచారు.

నగరంలో పెద్దసంఖ్యలో ప్రార్థనా మందిరాలున్నాయి. ఈ కనెక్షన్లపై స్థిర ఛార్జీలు రూ.260 ఉండగా..రూ.285కు పెంచారు. యూనిట్ ఛార్జీల్లో మార్పు చేయలేదు.

వీరికి పెరిగాయ్.. నెలకు 800 యూనిట్లపైన వినియోగించేవారు నగరంలోనే అత్యధికంగా ఉంటారు. వీరికి కిలోవాట్‌కు స్థిర ఛార్జీ రూ.10 ఉండగా.. ఏకంగా రూ.50కి పెంచారు. ఈ వర్గాలకు ఇది పెద్ద భారం కాదని డిస్కం అంటోంది.

**రూ.30 కోట్ల వరకు..**రాష్ట్రంలో రూ.1200 కోట్ల ఛార్జీల పెంపునకు డిస్కం ప్రతిపాదించగా.. అందులో రూ.1170 కోట్ల వరకు భరించేందుకు సర్కారు ముందుకొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.30కోట్లే వినియోగదారుల నుంచి వసూలుకు అనుమతి ఇచ్చామని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి తెలిపింది.

# రహదారులే కల్లాలు.. తప్పని ప్రమాదాలు

కొడంగల్ : కల్లాలు లేక ఆరుగాలం కష్టపడి పండించిన జొన్న, పెసర, మినుములు, వరి ధాన్యం నూర్పిళ్లు, ఆరబోతకు అన్నదాతలకు రహదారులే ఆధారంగా నిలుస్తున్నాయి. ఫలితంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి జారిపడి గాయాల పాలవుతున్నారు. కొన్నిచోట్ల ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు తప్పించుకోలేక పరస్పరం ఢీకొని మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో చాలానే జరిగాయి. కల్లాలు నిర్మిస్తున్నామని చెబుతున్న అధికారుల హామీలన్నీ మాటలకే పరిమితం అవుతున్నాయి. అన్నదాతలు వేరే మార్గం లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెడతున్నారు.కుల్కచర్ల మండల పరిధిలోని ఘనాపూర్, రాంనగర్, ముజాహిద్‌పూర్ గ్రామాల పరిసరాల్లో ప్రధాన రోడ్లపై ఎక్కువగా జొన్న, వరి ధాన్యం ఆరబోస్తూ నూర్పిళ్లు చేస్తున్నారు. తరువాత వృథాగా మారిన కంకులు, గడ్డిని అలాగే వదిలి వెళుతున్నారు.ఇటీవల దుద్యాల మండలంలోని సాగారం తండా వద్ద రోడ్డుపైనే ధాన్యం పోయడంతో గమనించని ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కిందపడిపోయాడు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారితో పాటు కోస్గి-తుంకిమెట్ల, బాపల్లితండా-కొడంగల్ రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. సాయంత్రం కాగానే కుప్పగా చేసి వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్లపై వాహనదారులు వీటిని గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై ఎండబెట్టి నూర్పిళ్లు చేయడం వల్ల దుమ్ము, ధూళి వాహనదారుల కళ్లలోకి చేరి కింద పడిపోతున్నారు. ఆరబెట్టవద్దని పోలీసులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా కల్లాలు లేక ప్రయోజనం చేకూరడంలేదు.

# చెరకు.. మిగిలేదేంటి చివరకు..



అనకాపల్లి : జిల్లాలో చెరకు సాగు భారీగా తగ్గింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది కేవలం 5,821 హెక్టార్లలోనే సాగు చేశారు. దశాబ్దం క్రితం వరకూ 42 వేల హెక్టార్లకు తక్కువ లేకుండా సాగు చేసేవారు. ఆ తర్వాత నుంచి ఏటా తగ్గుతూ వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో చెరకు సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. ఉన్న ఒక్క గోవాడ ఎప్పుడు మూతపడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు చెరకు సాగుపట్ల ఆసక్తి చూపడం లేదు. పోనీ బెల్లం తయారీ చేద్దామంటే వాటి ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పసుపు ఆకు తెగులు కారణంగా తోట ఎదుగుదల లేక దిగుబడులు సగానికి పైగానే పడిపోతున్నాయి. మరోవైపు సాగు ఖర్చులు ఏటేటే పెరుగుతూ వస్తున్నాయి. దీంతో చెరకు పంట అంటేనే రైతులు హడలిపోయే పరిస్థితి ఏర్పడింది.

**పీడిస్తున్న తెగుళ్ల...**

పసుపు ఆకు తెగులు కారణంగా దిగుబడులు సాగానికి సగం తగ్గిపోయాయని రైతులు తెలిపారు. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి రావాల్సి ఉన్నా 15 టన్నులకు మించడం లేదు. పంట మార్పిడి చేసుకోవాలని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. పసుపు ఆకు తెగులుపై పరిశోధనలు చేస్తున్నామని, తెగులును తట్టుకునే రెండు రకాలు గుర్తించామన్నారు.


**పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ**

అందరికీ తీపిని పంచే చెరకు రైతులు ప్రస్తుతం చేదును అనుభవిస్తున్నారు. ఆరుగాలం కుటుంబం అంతా కష్టపడినా అప్పులు మాత్రమే మిగులుతున్నాయని రైతులు దాడి సీతారాము, టెక్కలి కొండలరావు వాపోయారు. చెరకు దీర్ఘకాలిక పంట. పంట పక్వదశగా రావాలంటే 10 నుంచి 11 నెలల సమయం పడుతుంది. ఎకరా భూమిలో చెరకు సాగు చేసేందుకు రూ. 77 వేలు ఖర్చు అవుతుంది. ఆదాయం రూ. 60 వేలకు మించడం లేదని రైతులు వాపోతున్నారు. ఏడాది పాటు పుష్కలంగా సాగు నీరు లభించే మునగపాక ప్రాంతాలలోనూ రైతులు చెరకు సాగుకు బదులు సరుగుడు వేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**సరుగుడు మేలు- పిట్ల రామారావు, రైతు, నాగవరం**

పదేళ్లగా వ్యవసాయం చేస్తున్నాను. గత ఐదేళ్లగా చెరకు తోటలకు తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. శాస్త్రవేత్తలు చెప్పినట్లు చేస్తున్నా తెగులు మాత్రం తగ్గడంలేదు. గతంలో ఎకరాకు 32 టన్నులు దిగుబడి వచ్చేది. ఇప్పుడు 14 టన్నులకు మించి రావడం లేదు. ఏటా నాలుగు ఎకరాలలో చెరకు సాగు చేసే వాడిని. ఇప్పుడు రెండు ఎకరాల్లోనే వేశాను. మిగిలిన భూమిలో వరి వేస్తున్నాను. చెరకు కంటే సరుగుడు సాగు బాగుంది.

# చెరువుల కబ్జాలకు చెక్ పెట్టేలా!.. సర్వేతో పక్కా లెక్కలు.. జియో ట్యాగింగ్‌తో హద్దులు



హైదరాబాద్ : చెరువులు.. జలవనరులను ఎవరూ ఆక్రమించకుండా రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పక్కాగా లెక్కలు సిద్ధంచేస్తున్నారు. గ్రామ నక్షాలు, డిజిటల్ సర్వేల సహాయంతో వాటి విస్తీర్ణాన్ని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ణయిస్తున్నారు. ప్రతి చెరువుకు జియోట్యాగ్ ఏర్పాటుచేసి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో 1075 చెరువులుండగా 107వి పూర్తిచేసి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రత్యేక బృందాలుగా మిగిలినవాటి తుది సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.

ప్రహరీలతో కలిపేసుకున్నారు..

**రెవెన్యూ అధికారుల సర్వేలో..** చెరువుల సమీపంలో వెంచర్లు వేసినవారు, రియల్ సంస్థల ప్రతినిధులు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించిన వారిలో కొందరు బఫర్‌జోన్లలో కొన్ని స్థలాలను ఆక్రమించుకున్నారని గుర్తించారు. వెంచర్లు, బహుళ అంతస్తుల ప్రహరీలు ఎంత పొడవున్నాయో అంత.. పదడుగుల నుంచి ఇరవై అడుగుల వెడల్పు ప్రాంతాన్ని కలిపేసుకున్నారు. ఇలాంటి ఆక్రమణలు శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని అధికారుల పరిశీలనలో తేలింది. యాభైకి పైగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను కొందరు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు మార్చేసి నిర్మాణాలు చేపట్టారు. గండిపేట మండలంలో ఒక ప్రైవేటు వ్యక్తి బఫర్‌జోన్‌లో విల్లాలు నిర్మించగా.. వాటిని కూల్చేసి కొత్తగా బఫర్ జోన్ హద్దులను అధికారులు ఏర్పాటుచేశారు. శేరిలింగంపల్లిలో ఓ రియల్ సంస్థ ముప్పై అడుగుల వెడల్పుతో 750మీటర్ల పొడవు బఫర్ జోన్‌ను తమ ప్రహరీలో కలిపేసుకుంది.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు**


ఆక్రమించిన జల వనరులు, చెరువుల భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను రెవెన్యూ అధికారులు నియమించారు. ఈ బృందాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో పాటు హైడ్రా అధికారులు ఉన్నారు. వీరు రియల్ వెంచర్ల సమీపంలోని చెరువులపై దృష్టి కేంద్రీకరించి రెండుమూడు రోజులకోమారు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించనున్నారు. ప్రాధాన్య ప్రాంతాల్లోని చెరువుల్లో కొన్నింటికి సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు. వెబ్‌సైట్‌లో వివరాలతో పాటు ప్రతి చెరువు పరివాహక ప్రాంతాన్ని జియో ట్యాగింగ్ చేయనున్నారు. దీంతో, చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తే వెంటనే అధికారులకు తెలిసిపోతుంది.

జిల్లాలో మొత్తం చెరువులు 1075

సర్వేకు గుర్తించినవి 981ప్రాథమిక సర్వే పూర్తయినవి 894

తుది సర్వే పూర్తయినవి 107

# మెట్రో -2 భూ సేకరణకు చిక్కులు తక్కువే



హైదరాబాద్ : మెట్రో రైలు రెండోదశలో పాతబస్తీ మార్గంలో మినహా మిగతా నాలుగు కారిడార్లలో పెద్దగా భూసేకరణ చిక్కులు లేవు. ఆయా కారిడార్ల నిర్మాణానికి పాతబస్తీ కంటే తక్కువ వ్యయమవుతుందని సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో అంచనా వేసింది. సెంట్రల్ మీడియన్ మీదుగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. మెట్రో రెండోదశ మొదటి భాగంలో 76.4 కి.మీ. ప్రతిపాదించారు. రూ.24,269 కోట్లు వ్యయంగా అంచనా వేశారు. సగటున కిలోమీటర్ నిర్మాణానికి 317.65 కోట్లు అవుతుంది.

ఈ కారిడార్‌లోనే చిక్కులు: ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మార్గంలో 1400వరకు ఆస్తులు సేకరణ, రహదారి విస్తరణ చేపట్టాలి. వీటికే రూ.800కోట్ల దాకా వ్యయమవుతుందని అంచనా. కి.మీ.కి రూ.365.46 కోట్లవుతుందని అంచనా వేశారు.

**అధిక ఖర్చు ఇక్కడే:** రాయదుర్గం-కోకాపేట నియో పోలీసు వరకు 11.6 కి.మీలకు వ్యయ అంచనా రూ.4318 కోట్లు. ఇక్కడ భూముల ధరలే కారణం. సగటున కి.మీ.నిర్మాణానికి రూ.372 కోట్లవుతుందన్నారు. రెండోదశలో అత్యధిక సగటు వ్యయం ఇదే.

అత్యల్పం హయత్‌నగర్ మార్గంలో.. ఎల్బీనగర్ - హయత్‌నగర్ జాతీయ రహదారి మార్గంలో 7.1కి.మీ మెట్రోని ప్రతిపాదించారు. రూ.1877 కోట్లవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.264 కోట్లు అవుతుంది. అన్ని కారిడార్ల కంటే అత్యల్ప వ్యయం ఇక్కడే. **ఈ రెండు మార్గాల్లో...**

నాగోల్‌నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కి.మీ. ఉంటుంది. రూ.11,226 కోట్ల అవుతుందని అంచనా వేశారు. సగటున కి.మీ. మెట్రో నిర్మాణానికి ఇక్కడ వెచ్చించాల్సిన వ్యయం రూ.305 కోట్లు. పెద్దగా భూసేకరణ సమస్యలు లేవని అధికారులు చెప్పారు. మియాపూర్-పటాన్‌చెరు మార్గంలో 13.4 కి.మీ.కు గాను రూ.4107 కోట్లు అంచనా వేశారు. సగటు కి.మీ.కు రూ.306 కోట్లు.

బెంగళూరు, చెన్నైకంటే తక్కువే

ప్రస్తుత మెట్రో రెండోదశ పనులు జరుగుతున్న బెంగళూరులో 75 కి.మీ.కు రూ.40వేల కోట్లు, చెన్నైలో 118.9 కి.మీ.కు రూ.63,246 కోట్లుగా అంచనా వేశారు. సగటున కి.మీ.కు రూ.531 నుంచి రూ.533 కోట్లు అవుతుంది. దీంతో పోలిస్తే చాలా తక్కువ వ్యయంతో హైదరాబాద్ మెట్రో-2 నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని అధికారులు చెబుతున్నారు. ఆప్టిమల్ డిజైన్‌తో అంచనా వ్యయాలు తగ్గించేలా జాగ్రత్త తీసుకున్నామన్నారు. నిర్మాణం సైతం వేగంగా పూర్తయ్యేలా చర్యలుంటాయని చెప్పారు.

# దండిగా తోడేశారు!

ఎల్లారెడ్డిపేట : జిల్లాలో భూగర్భ జలాలను దండిగా తోడేశారు. అక్టోబరులో సాగుకు భారీగా వాడటంతో ఒక్క నెలలోనే 0.07 మీటర్లకు తగ్గిపోయాయి. వేములవాడ అర్బన్‌లో భూగర్భజల మట్టాలు ప్రమాద ఘంటికలను మోగిస్తుండగా 11.6 మీటర్ల లోతున కూడా పాతాళగంగ పైకిరానంటోంది. జిల్లాలోని రుద్రంగిలో మాత్రం 2.71 మీటర్ల అత్యల్ప లోతున నీరు లభిస్తోంది. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వరిపంటను వేశారు. పైరు పొట్టదశ నుంచి ఈనే దశ వరకు భారీగా సాగునీరు అవసరమవుతుంది. ఈ సమయంలో పంటకు నీరందించే క్రమంలో బోర్లు, బావులను నిరంతరాయంగా నడపడం వల్ల భూగర్భజల మట్టాలు సాధారణంగానే కొంతమేర తగ్గిపోతాయని భూగర్భజలశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం, భూగర్భ జల మట్టాలు ఆశాజనకంగా ఉండటంతో ఏటా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో జూన్ నుంచి నవంబరు 3 వరకు 814.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 966.4



మిల్లీమీటర్లు కురిసింది. దీన్ని బట్టి చూస్తే 19.0 శాతం ఎక్కువగా వర్షాలు పడ్డాయి.జిల్లాలో 2,32,046 ఎకరాల్లో వివిధ రకాల పంటలను వేయగా, అందులో సుమారు 1,80,310 ఎకరాల్లో వరి, 1246.24 ఎకరాల్లో మొక్కజొన్న, 49,332 ఎకరాల్లో పత్తిని ప్రధాన పంటలుగా సాగు చేశారు.

ఈ సంవత్సరం జూన్‌లో సగటు భూగర్భజల మట్టాలు 11.52 మీటర్లు, జులైలో 10.29 మీటర్లు, ఆగస్టులో 8.15 మీటర్లు, సెప్టెంబరులో 5.76 మీటర్లు, అక్టోబరులో 5.83 మీటర్ల లోతులో ఉన్నాయి.

గత నెల నుంచి అక్టోబరు వరకు ఒక్క నెల వ్యవధిలో 0.07 మీటర్లకు తగ్గిపోయాయి.గతేడాది అక్టోబరుతో పోల్చితే 1.05 మీటర్లు తగ్గిపోయాయి. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, అందులో వరి ఎక్కువగా ఉండటం వల్ల భూగర్భజలాల వినియోగం భారీగా పెరిగింది.

వరి పంటకు పొట్ట, ఈనే దశలో సాగునీరు ఎక్కువగా వాడాల్సి వచ్చింది. దీంతో భూగర్భజలాల తోడకం బాగా పెరిగింది. సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకు 0.07 మీటర్లకు తగ్గిపోయింది.

**సమృద్ధిగా వర్షాలతో...**జిల్లాలో ఈ సంవత్సరం నవంబరు 3 వరకు చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో అధిక వర్షపాతం నమోదవగా రుద్రంగి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, కోనరావుపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో వర్షాలు సాధారణానికి పరిమితమయ్యాయి.జిల్లాలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన చెరువులు 94, వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉన్నవి 539. మొత్తం 633 చెరువులకు గాను 213 మత్తడి పారాయి. ఇందులో 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న 39 చెరువులు, 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న 174 చెరువులు సైతం మత్తడి దూకాయి.


# అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతల ఆవేదన

కరీంనగర్ : ఇలా జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల గడప దాటని భూబాధితుల సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రతి నిర్వహించే ప్రజావాణికి సుమారు రెండొందలపైనే ఫిర్యాదులు వస్తుంటాయి. ఇందులో సింహభాగము భూ సమస్యలే. జిల్లావ్యాప్తంగా మెజారిటీ రైతులు వ్యవసాయ పనులను పక్కనపెట్టి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని చూసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది.

**లెక్కకు మించి దరఖాస్తులు**

రైతులకు వంద శాతం మేలు చేయాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ శాఖ మంత్రి సూచిస్తూనే ఉన్నారు. పేరుకుపోయిన అర్జీలను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిష్కరించేలా జిల్లా ఉన్నతాధికారులు భావిస్తున్నా.. అపరిష్కృత దరఖాస్తులు లెక్కకుమించి ఉన్నాయి. రైతుల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని.. పరిష్కరించే దిశగా కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.

**ప్రభుత్వ భూమిగా నమోదు**




ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడుకు చెందిన రామోజు శివకుమార్. ఈ యువరైతుకు వారసత్వంగా వచ్చిన పట్టా భూమిని అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూమిగా నమోదైంది. రికార్డుల నుంచి ప్రభుత్వ భూమిగా తొలగించాలని కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా.. న్యాయం జరగకపోవటంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు రైతుకు సానుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా న్యాయం కోసం ప్రజావాణి, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ పట్టా మార్పిడి చేయాలని తిరుగుతున్నాడు.

**కోర్టు తీర్పు ఇచ్చినా..**కరీంనగర్ గ్రామీణ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన నారాయణకు దుర్శేడు గ్రామ రెవెన్యూ పరిధిలో 2.11 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేది. ఇందులో రైల్వే లైన్ నిర్మాణంలో 0.38 ఎకరాల భూమి కోల్పోయాడు. మిగతా స్థలం సైతం రైల్వే లైన్ సర్వేలో కోల్పోయినట్లు ధరణిలో చూపిస్తోంది. తన పేరున పట్టా చేయాలని ప్రజావాణి, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ధరణిలో ఆప్షన్ లేదని అధికారులు దాటవేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. తీర్పు రైతుకు అనుకూలంగా వచ్చింది. అయినా న్యాయం జరగడంలేదు.






# తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకూ పింఛన్లు

## - సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు, ఉపాధి బిల్లుల జాప్యంపై తీవ్ర ఆగ్రహం

అమరావతి : రాష్ట్రంలో చాలామంది అనర్హులకు పింఛన్లు వెళ్తున్నాయ న్న మంత్రి నాదెండ్ల వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు స్పందించారు. రానున్న 3 నెలల్లో ప్రతీ పింఛన్ను జిల్లా కలెక్టర్లు పరిశీలించాలని అన్నారు. సచివాలయంలో రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఆయన కీలక ఆదేశాలిచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని డిమాండ్కు అనుగుణం గా నిర్వహించాలని.. 100 రోజుల పనిదినాలు సరిగా నిర్వహిస్తేనే మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందని చెప్పారు.

కానీ పని దినాలు, మెటీరియల్ కాంపోనెంట్ను పూర్తి చేయలేకపోతున్నారని అన్నారు. పల్లె పండుగలో 14.8 శాతమే పనులు చేశారని.. ఇంకా నెలన్నర సమయమే ఉందని గుర్తు చేశారు. అల్లూరి జిల్లాలో 54 శాతమైతే.. మరో జిల్లాలో 1. 6 శాతమే పనులు కావడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. పను లు పూర్తయ్యాక బిల్లులు ఎందుకు చెల్లించట్లేదని.. కలెక్టర్లు నిర్లిప్తంగా ఎందుకు ఉ ంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వద్ద ఉపాధి హామీ డబ్బులున్నా బిల్లులు ఎందుకు చెల్లించట్లేదని ప్రశ్నించారు.

**'అవి అర్హులకే దక్కాలి'** 'గత ప్రభుత్వం జల్జీవన్ మిషన్ను దెబ్బతీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం తిరిగి ప్రారంభించాం. కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులుంటే వారికీ పింఛన్ ఇవ్వాలి. సదరం ధ్రువీకరణ పత్రాలు అర్హులకే దక్కేలా చూడాలి. రాజధాని అమరావతి వేగంగా అభివృద్ధి చెందే నగరం. విజయవాడ, గుంటూరు వంటివి అమరావతిలో కలిసిపోతాయి. పట్టణీకరణ పెరుగుతున్న దృష్ట్యా నిరంతరాయంగా ప్రణాళికలుండాలి. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి. స్వచ్ఛాంధ్రలో భాగంగా పచ్చదనాన్ని పెంచేలా చూడాలి. స్వచ్ఛత – శుభ్రత అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం 82 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వదిలి వెళ్లింది. చెత్త తొలగించే పనులు వేగంగా పూర్తి చేయాలి.' అని సీఎం పేర్కొన్నారు.

# విద్య, మౌలిక వసతులపై ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్: మంత్రి లోకేశ



అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా పరంగా ప్రగతి కనిపించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విద్య, మౌలిక వసతులపై ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి జిల్లాలు, మండలాల వారీగా అకెడమిక్స్, మౌలిక సదుపాయాల ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇవ్వనున్నట్లు లోకేశ్ తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారా, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నారా అనే సమాచారం స్పష్టంగా ఉండాలన్నారు. "మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఉండేలా చూడాలని సీఎం స్పష్టంగా ఆదేశాలిచ్చారు. ఉన్నత విద్యాశాఖలోనూ భోజనం విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పరిశుభ్రతపైనా ఫిర్యాదులు వస్తున్నాయి. టాయిలెట్స్ లాంటి మౌలికమైన సదుపాయాలు కూడా సరిగ్గా ఉ ండటం లేదు. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. పేరెంట్స్–టీచర్ల మీటింగ్‌లో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే క్యాంపెయిన్ మొదలుపెడదాం. యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ మరింత విస్తృతం చేస్తాం. కేజీ నుంచి పీజీ వరకూ పాఠ్యాంశాల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మార్పులు కనిపించాలి" అని లోకేశ్ అన్నారు.

# తిరుపతిలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్వాకం.. అయ్యప్ప భక్తుల అవస్థలు

తిరుపతి: ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్వాకం భక్తులను ఇక్కట్ల పాల్జేసింది. ఈ ఘటన తిరుపతిలో జరిగింది. శబరిమల వెళ్లిన అయ్యప్ప భక్తులు తిరుగు ప్రయాణంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనం ఆలస్యం కావడంతో 35 మంది అయ్యప్ప భక్తులను వదిలేసి బస్సుతో డ్రైవర్ వెళ్లిపోయాడు. దీంతో బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద భక్తులు ఇబ్బందులు పడ్డారు. డయల్ 100కు అయ్యప్ప భక్తులు కాల్ చేయడంతో పోలీసులు స్పందించి నెల్లూరు టోల్‌గేట్ వద్ద బస్సును ఆపించారు. మరోవైపు అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో సదరు ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యంపై అయ్యప్ప భక్తులు ఫిర్యాదు చేశారు.




## అలా అయితే న్యాయవ్యవస్థపై నమ్మకం పోతుంది.. సుభాష్ సోదరుడి ఆందోళన

బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ (34) ఆత్మహత్యకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'భరణం ఇవ్వలేకపోతే చచ్చిపోవచ్చు అని న్యాయస్థానంలో జడ్జి ఎదుటే భార్య అతడిని అనడం.. న్యాయమూర్తి నవ్వడం సుభాష్‌ను తీవ్రంగా బాధించింది' అని అతడి బంధువులు ఆంగ్లవార్తా సంస్థకి వెల్లడించారు. "నా సోదరుడికి న్యాయం జరగాలని నేను కోరుకుంటున్నా. పురుషులకు కూడా ఈ దేశంలోని చట్ట ప్రక్రియ నుంచి న్యాయం అందాలి. న్యాయమూర్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవినీతి కొనసాగితే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది. మెల్లగా న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. తాము ఏటీఎం యంత్రాల వలే మారిపోతామనే భావనతో పెళ్లిళ్లు అంటేనే పురుషులు భయపడే పరిస్థితి దారితీస్తుంది" అని వ్యాఖ్యానించారు. తన సోదరుడు విడాకుల కేసుకు సంబంధించి సుభాష్ 40 సార్లు బెంగళూరు నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పుర్‌కు వెళ్లొచ్చాడని అతడు చెప్పాడు.

**నన్ను గొడ్డులా చూసేవాడు: సుభాష్ భార్య ప్రత్యారోపణలు :** సుభాష్ కుటుంబంపై అతడి భార్య నిఖితా కూడా తీవ్ర ఆరోపణలు చేసింది. తన అత్త కట్నం కోసం వేధించినట్లు పేర్కొంది. "నా భర్త మద్యం తాగి వచ్చి నన్ను కొట్టేవాడు. నన్ను ఒక పశువులా చూసేవాడు. నన్ను బెదిరించి జీతం మొత్తం తన ఖాతాలోకి బదలాయించుకొనేవాడు. అత్తగారి వేధింపుల కారణంగా.. నా తండ్రి ఆరోగ్యం దెబ్బతిని 2019లో మరణించారు" అని పేర్కొంది. మరోవైపు సుభాష్ బాబాయ్ మాట్లాడుతూ "అతడు కోర్టులో కేసు ఓడిపోయాడు. అతడి భార్య తరఫువారు నిత్యం డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. అతడి సామర్థ్యం మేరకు కుమారుడు పోషణకు డబ్బులు ఇచ్చాడు. తొలుత ఆ కుటుంబం రూ.40 వేలు డిమాండ్ చేసింది. ఆ తర్వాత దానిని రెట్టింపు చేసింది. చివరికి నెలకు రూ.లక్ష ఇవ్వాలని అడగడం మొదలుపెట్టింది. నాలుగేళ్ల కుమారుడిని అడ్డంపెట్టి అతడిని డబ్బు ముద్రించే యంత్రంలా మార్చేశారు. భరణం ఇవ్వలేకపోతే చచ్చిపోవచ్చు అని న్యాయస్థానంలో జడ్జి ఎదుటే భార్య అతడిని అనడం.. దానికి న్యాయమూర్తి నవ్వడం సుభాష్‌ను తీవ్రంగా బాధించింది' అని పేర్కొన్నారు.

**భార్య సతాయింపులు.. 40 పేజీల లేఖ రాసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య...** అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకొనే ముందు దాదాపు 80 నిమిషాల వీడియోను చిత్రీకరించాడు. అందులో అతడు "నేను సంపాదించే డబ్బు నా శత్రువులను మరింత బలోపేతం చేస్తోంది. వారు దానిని వాడుకొనే నన్ను నాశనం చేస్తున్నారు. ఇది ఒక విష వలయంలా మారింది. అందుకే నేను చచ్చిపోవాలనుకుంటున్నాను" అని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశాడు. భార్య సతాయింపులు తట్టుకోలేక అతుల్ సుభాష్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. మరణానికి ముందు ఆయన ఏకంగా 40 పేజీల లేఖ రాసి బలవన్మరణానికి పాల్పడ్డారని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన ఒక కంపెనీలో ఐటీ డైరెక్టర్‌గా పని చేస్తూ మారతహళ్లిలోని మంజునాథ లేఅవుట్లో ఉంటున్నారు. భార్యతో తాను అనుభవిస్తున్న మానసిక క్షోభకు సంబంధించి రాసిన లేఖను ఇ–మెయిల్ ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తన కార్యాలయం అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులకు పంపించారు. తన నివాసంలో ఆదివారం అర్ధరాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మంగళవారం గుర్తించారు.

**సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు..** దేశవ్యాప్తంగా అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసుపై చర్చ జరుగుతున్న వేళ.. సుప్రీంకోర్టు భరణం మంజూరులో పరిగణనలోకి తీసుకోవాల్సిన కీలకమైన 8 పాయింట్ల ఫార్ములాను ప్రకటించింది. జస్టిస్ విక్రమ్, జస్టిస్ ప్రసన్న బి వరాల ధర్మాసనం ఓ కేసు విచారణలో వీటిని వెల్లడించింది. ఇరుపక్షాల ఆర్థిక, సామాజిక హోదాలను పరిగణనలోకి తీసుకోవాలి. భార్యాబిడ్డల అవసరాలు.

ఇరుపక్షాల విద్యార్హతలు, ఉద్యోగ హోదాలు. కేసు వేసిన వ్యక్తి సొంత సంపాదన, ఆస్తులు. వివాహ బంధంలో ఉన్న వేళ ఆ మహిళ అనుభవించిన జీవన ప్రమాణాలు. కుటుంబ బాధ్యతల కోసం వదులుకొన్న ఉపాధి అవకాశాలు. భర్త ఆర్థిక సామర్థ్యం, సంపాదన, నిర్వహణ ఖర్చులు, అప్పులను పరిగణనలోకి తీసుకోవాలి.




## వైకాపాకు మరో షాక్.. మాజీ మంత్రి అవంతి రాజీనామా

విశాఖపట్నం: వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి పంపినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జగన్‌పై అవంతి పలు విమర్శలు చేశారు. "ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించాలి. ఐదేళ్లు పాలించాలని కూటమికి ప్రజలు తీర్పు ఇచ్చారు. కనీసం ఐదు నెలల కూడా సమయం ఇవ్వకుండా ధర్నాలు అంటే ఎలా? వైకాపాలో కార్యకర్తలు నలిగిపోయారు.


పార్టీ అంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి. ఐదేళ్లు కార్యకర్తలందరూ ఇబ్బంది పడ్డారు. తాడేపల్లిలో కూర్చుని ఆయన (జగన్‌ను ఉద్దేశించి) ఆదేశాలిస్తారు.. కానీ క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు" అని అవంతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.




## తిరుమల, తిరుపతిలో భారీ వర్షం.. భక్తుల ఇబ్బందులు

తిరుమల: తిరుమల, తిరుపతిలో భారీ వర్షం కురిసింది. వర్షానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చలితీవ్రత పెరిగింది. ఘాట్ రోడ్లలో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉ ండటంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. గోగర్భం, పాపవినాశనం పూర్తిగా నిండి నీరు ఔట్ ఫ్లో అవుతోంది. భారీవర్షానికి తిరుపతి వీధులు జలమయమయ్యాయి. లక్ష్మీపురం కూడలి, గొల్లవానిగుంటలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తోంది. వెస్ట్ చర్చి కూడలిలో రైల్వే అండర్ బ్రిడ్జి వర్షపు నీటితో నిండింది. అధికారులు వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. బాలాజీ కాలనీ నుంచి మహిళా వర్సిటీ మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. తిరుపతిలో మాల్వాడిగుండం జలపాతం పొంగిపొర్లుతోంది. కపిలతీర్థం పుష్కరిణికి వెళ్లకుండా తితిదే భక్తులను నిలిపివేసింది.

# రెండు రోజుల పోలీసు కస్టడీకి వర్రా రవీందర్‌రెడ్డి



కడప: వైకాపా సామాజిక కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డికి న్యాయస్థానం రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పులివెందుల పోలీసులు కడప కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కడప కోర్టు ఆదేశాలు ఇచ్చింది. వర్రా రవీందర్‌రెడ్డిని న్యాయవాది సమక్షంలోనే విచారించాలని సూచించింది. ప్రస్తుతం వర్రా రవీందర్‌రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పులివెందుల పోలీసులు ఆయన్ను కస్టడీకి తీసుకోనున్నారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, జగన్ తల్లి విజయమ్మ, మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీతపై సోషల్ మీడియాలో అత్యంత హేయంగా, జుగుప్సాకరంగా రవీందర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టాడు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌తో పాటు పలుచోట్ల కేసులు నమోదయ్యాయి.



## వైకాపాకు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గుడ్‌బై

భీమవరం: వైకాపాకు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేసిన కాసేపటికే మరొకరు గుడ్‌బై చెప్పారు. వైకాపాకు రాజీనామా చేసినట్లు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రకటించారు. వైకాపా ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులకు ఆయన గుడ్‌బై చెప్పారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్‌కు పంపారు.

## ఘాట్ రోడ్డులో జారిపడిన బండరాళ్లు.. భక్తులను అప్రమత్తం చేసిన తితిదే



తిరుమల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుమలలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ధాటికి ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. 2వ ఘాట్ రోడ్డులోని హరిణికి సమీపంలో జారిపడిన బండరాళ్లను సిబ్బంది తొలగించారు. ఘాట్‌రోడ్డులో జాగ్రత్తగా వాహనాలు నడపాలని తితిదే అధికారులు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తితిదే ముందస్తు చర్యలు చేపట్టింది. పాపవినాశనం, ఆకాశగంగ, శ్రీవారి పాదాలు, శిలాతోరణం వెళ్లే మార్గాల్లో భక్తుల వాహనాల రాకపోకలను నిలిపివేసింది. రెండు ఘాట్‌రోడ్లలో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉండటంతో ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేసింది. వర్షం కారణంగా శ్రీవారి భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

## జగన్.. రైతులను దగా చేసిన మీకు నిరసన చేపట్టే అర్హత ఉందా?: మంత్రి నాదెండ్ల



అమరావతి: రైతుకు ఎవరు అండగా నిలబడ్డారో జగన్ ఒకసారి చూడాలని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లపై జగన్ చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా మంత్రి స్పందించారు. "మీ హయాంలో ఈ సమయానికి కేవలం 8.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే సేకరించారు. బాధ్యత కలిగిన మా కూటమి ప్రభుత్వం 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. 48 గంటలలోపే డబ్బులు జమ చేస్తున్నాం. జగన్ పాలనలో ఏ రోజైనా రైతులకు సక్రమంగా చెల్లింపులు చేశారా? గోతాలు కూడా సరిపడా ఇవ్వలేకపోయారు. రైతులను దగా చేసిన మీకు నిరసన ర్యాలీలు చేసే అర్హత ఉందా?" అని నాదెండ్ల మనోహర్ నిలదీశారు.

## ఈమెకు 49 ఏళ్లు అంటే నమ్ముతారా?

తెలుగు ప్రేక్షకులకు 1996లో సాహస వీరుడు సాగర కన్య సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ శిల్పా శెట్టి. ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి 30 ఏళ్లు పూర్తి అయినా ఇప్పటికీ ఆమె అంటే ఇష్టపడే వారు ఎంతో మంది ఉంటారు. ఆమె సినిమాలు చేసినా చేయకున్నా ఒక వర్గం ప్రేక్షకులు ఆమె కదిలినా వావ్ అంటూ అభిమానం చూపిస్తూ ఉంటారు. అంతటి అభిమానులను సొంతం చేసుకున్న శిల్పా శెట్టి వయసు ప్రస్తుతం 49 ఏళ్లు. ఈ వయసులో సాధారణంగా ఆడవారు ఎక్కువ శాతం మంది పూర్తిగా ఇంటికే పరిమితం కావడం లేదంటే అందం తగ్గడంతో తెర వెనక్కి వెళ్లడం చేస్తూ ఉంటారు. శిల్పా శెట్టి మాత్రం ఈ వయసులోనే పాతికేళ్ల పడుచు అమ్మాయిలకు పోటీ ఇచ్చేంత అందంగా కనిపిస్తూ ఉన్నారు. శిల్పా నటి మాత్రమే కాకుండా యోగా ట్రైనర్‌గా కూడా వ్యవహరిస్తూ ఉంటుంది. అందుకే ఆమె ఫిజిక్ ఇప్పటికీ పాతికేళ్ల అమ్మాయి మాదిరిగానే ఉంటుంది. ఎక్కడా వయసు లక్షణాలు కనిపించవు. అంతే కాకుండా ఆమె మొహం మూడు పదుల సంవత్సరాల క్రితం ఎలా ఉ ందో ఇప్పుడూ అలాగే కనిపిస్తూ ఉంది. ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అందంగా శిల్పా కనిపిస్తారు అంటూ అభిమానులతో పాటు సోషల్



మీడియాలో నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉండటం మనం చూస్తూ ఉంటాం. రెగ్యులర్‌గా శిల్పా శెట్టి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. బుల్లి తెరపై అప్పుడప్పుడు వెండి తెరపై సందడి చేస్తున్న శిల్పా శెట్టి సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఈసారి జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియోలను షేర్ చేసింది. ఈ అందమైన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మినీ షార్ట్ ధరించిన శిల్పా స్పోర్ట్స్ టాప్‌ను ధరించి నడుము అందం చూపిస్తోంది.

సాధారణంగానే శిల్పా శెట్టి చాలా అందంగా ఉంటారు. ఇప్పుడు ఈ ఔట్ ఫిట్‌లో చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. శిల్పా శెట్టి పెళ్లి అయిన ఇన్ని సంవత్సరాల తర్వాత, ఈ వయసులోనూ ఇంత ఫిట్‌గా ఉండటం గొప్ప విషయం, ఈమె ఎంతో మందికి ఆదర్శం. ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీలో ఉన్న యంగ్ హీరోయిన్స్ శిల్పా శెట్టిని ఆదర్శంగా తీసుకుని ఫిట్‌గా ఉ ండాలంటూ కొందరు సూచిస్తూ ఉన్నారు. ఇప్పటికీ యంగ్ హీరోలకు జోడీగా హీరోయిన్‌గా నటించేంత అందంగా శిల్పా ఉన్నారు. మరో పదేళ్లు అయినా శిల్ప అందం ఏమాత్రం తగ్గదేమో అంటూ ఆమె అభిమానులు ఆనందంగా ఈ పోటోలను షేర్ చేస్తూ లైక్ చేస్తున్నారు. శిల్పా ఇంతటి అందంతో ఎందుకు వరుసగా సినిమాలు చేయడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పై అయినా ఆమె నుంచి సినిమాలు వరుసగా రావాలని కోరుకుందాం.

## బాలయ్య వారసుడి ఫస్ట్-5 ఫిక్సైపోయాయా?

నందమూరి నటవారసుడు మోక్షజ్ఞ మొదటి ఐదు చిత్రాలు ముందే ఫిక్సై అయిపోయాయా? తనయుడిని బాలయ్య పక్కా ప్లాన్ తోనే రంగంలోకి దించుతున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రశాంత్ వర్మతో మోక్షజ్ఞ డెబ్యూ చిత్రాన్ని పట్టాలెక్కిస్తున్నట్లు ప్రకటించారు. అయితే అనూహ్యంగా ఆప్రాజెక్ట్ డైలమాలో పడిందనే ప్రచారం సాగుతంది. తప్పకుండా ఆ సినిమా ఉంటుంది? కానీ అది డెబ్యూ అవుతుందా? రెండవ సినిమా అవుతుందా? అన్నది ఆసక్తి కరంగా మారింది. ఎందుకంటే? మోక్షజ్ఞతో బాలయ్య అంతకు మించి ప్లాన్ చేస్తున్నాడనే కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. 'కల్కి 2898' దర్శకుడు నాగ్ అశ్విన్ తో తనయుడిని లాంచ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. ఒకవేళ నాగ్ అశ్విన్ తో మొదటి సినిమా కాకపోతే



రెండవ సినిమా అయ్యే అవకాశం ఉంటుందిట. అలా ప్రశాంత్ వర్మ-నాగ్ అశ్విన్ మధ్య చిన్న గేమ్ నడుస్తోంది. ఈ రెండు సినిమాల తర్వాత మరో యువ మేకర్ వెంకీ అట్లూరితో సినిమా చేసేలా ఒప్పందం చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. వెంకీ సక్సెస్ ట్రాక్ చూసి బాలయ్య ఇలా అతడిని కూడా తెరపైకి తెస్తున్నట్లు వినిపిస్తుంది. అలాగే 'ఆదిత్య 999'కి సీక్వెల్ ఉంటుందని కూడా చాలా కాలం క్రితం ప్రకటించారు. అందులో మోక్షజ్ఞ నటిస్తాడని కూడా ప్రచారంలో ఉంది. ఇక బాలయ్యలో కొత్త యాంగిల్ ని తట్టి లేపిన బోయపాటి శ్రీనుతో తనయుడికి ఓ ప్రాజెక్ట్ సెట్ చేసి పెట్టారు. మోక్షజ్ఞ ఓ మూడు సినిమాల తర్వాత బోయపాటితో సినిమా చేస్తే బాగుంటుందని ఇలా అతడిని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. మొత్తంగా మోక్షజ్ఞ కోసం బాలయ్య మొదటి ఐదు సినిమాలు ముందుగానే సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఏడాది 2025లో ఏదో ఒక సినిమాతో మోక్షజ్ఞ బొమ్మ థియేటర్లో పడటం అయితే ఖాయం.




## సాంప్రదాయ చీర కట్టులో నిధి



నాగ చైతన్యతో కలిసి సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన నిధి అగర్వాల్ ఆ వెంటనే అఖిల్ సినిమా మిస్టర్ మ జ్ను సినిమాలో నటించిన విషయం తెల్సిందే. బ్యాక్ టు బ్యాక్ అక్కినేని బ్రదర్స్‌తో నటించడంతో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ నిధి అగర్వాల్ టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మాత్రం గుర్తింపు సొంతం చేసుకోలేక పోయింది. ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచినా నిధి అగర్వాల్‌కి ఆఫర్లు మాత్రం కంటిన్యూ అవుతూ వచ్చాయి. మిస్టర్ మజ్ను తర్వాత పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. రామ్ కి జోడీగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద ఇస్మార్ట్ శంకర్ సినిమా కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టాలీవుడ్‌లో నిధి అగర్వాల్ బిజీ అయ్యింది. తెలుగుతో పాటు తమిళ్‌లోనూ ఈమె నటించే అవకాశాలు సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోలేక పోయినా తాజాగా పవన్ కళ్యాణ్‌కి జోడీగా హరి హర వీరమల్లు సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో ఈ అమ్మడు రాజకుమారి పాత్రలో కనిపించబోతుంది. ఆ విషయాన్ని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. సినిమాలతో కాస్త తక్కువ కనిపించినా సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా సినిమాలు చేస్తూ కనిపిస్తూ ఉంది. అందంతో ఆకట్టుకోవడంతో పాటు తనకు ఉన్న ఆసక్తితో మోడలింగ్‌లోనూ రాణిస్తూ వస్తోంది. ఏ ఔట్ ఫిట్ ధరించినా భలే అందంగా కనిపించే నిధి అగర్వాల్ తాజాగా సాంప్రదాయబద్ధమైన చీర కట్టులో కనిపించి ప్రతి ఒక్కరిని సర్‌ప్రైజ్ చేసింది. అందమైన పట్టు చీర కట్టులో నిధి అగర్వాల్ ఆకట్టుకుంది అంటూ అంతా కామెంట్స్ చేస్తున్నారు. అందంగా ఉన్న నిధి అగర్వాల్‌కి ఆశించిన స్థాయిలో ఆపర్లు రాకపోవడం విచారకరం అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తో ప్రస్తుతం చేస్తున్న హరిహర వీరమల్లు సినిమా విడుదల తర్వాత కచ్చితంగా నిధి అగర్వాల్‌కి మంచి క్రేజ్ దక్కడం ఖాయం. సినిమాల్లో ఇక నుంచి బిజీ బిజీగా ఈ అమ్మడు నటించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా యంగ్ హీరోలు, యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఈమె డేట్ల కోసం ఎదురు చూసే రోజు వస్తుంది అంటూ ఇలాంటి ఫోటోలు షేర్ చేసినప్పుడు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ముందు ముందు నిధి అగర్వాల్ ఇదే అందంతో సోషల్ మీడియాలో సందడి చేస్తే కచ్చితంగా మరిన్ని సినిమాలు, అదీ కాకుండా ప్రముఖ స్టార్స్‌కి జోడీగా నటించే అవకాశాలు రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## గూగుల్ ట్రెండ్స్.. హనుమాన్ ఫుల్ జోష్..




టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జ, టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబోలో తెరకెక్కిన హనుమాన్ మూవీ ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. చిన్న సినిమాగా విడుదలై.. పెద్ద విజయం సాధించింది. 2024 సంక్రాంతి విన్నర్ గా నిలిచి.. భారీ వసూళ్లను రాబట్టింది. మేకర్స్ కు వేరే లెవెల్ లాభాలు అందించింది. ఊహించని రీతిలో పాన్ ఇండియా లెవెల్ లో అందర్నీ మెప్పించి అబ్బురపరిచింది. సంక్రాంతి బరిలో దిగిన మహేష్ బాబు గుంటూరు కారం, వెంకటేష్ సైంధవ్, నాగార్జున నా సామి రంగ సినిమాలతో పోటీ పడి మరీ హనుమాన్ చిత్రం సత్తా చాటింది. 90 ఏళ్ల సంక్రాంతి సీజన్ సినిమాల రికార్డులు అన్నీ బ్రేక్ చేసింది. బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. తెలుగులోనే కాదు.. హిందీలో కూడా అదరగొట్టింది. సూపర్ హీరో కాన్సెప్ట్ కు ఇండియన్ మైథాలజీని లింక్ చేసి తెరకెక్కించిన హనుమాన్ మూవీ థియేటర్స్ లోనే కాదు.. ఓటీటీలో కూడా దుమ్ము రేపింది. కొద్ది రోజుల క్రితం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శించబడింది. అక్కడ స్టాండింగ్ ఒవేషన్ ను అందుకుంది. తెలుగు సినిమా ఖ్యాతిని మరోసారి చాటి చెప్పింది. ఇప్పుడు ఆ మూవీకి సీక్వెల్ గా జై హనుమాన్ మూవీ తెరకెక్కుతోంది. కన్నడ యాక్టర్ రిషభ్ శెట్టి లీడ్ రోల్ లో నటిస్తున్నారు. హనుమంతుడిగా సినిమాలో కనిపించనున్నారు. తేజ సజ్జ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని భావించినా.. ఆ తర్వాతే విడుదల అయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే హనుమాన్ మూవీ.. తాజాగా అరుదైన ఘనత సాధించింది. ఆ విషయాన్ని గూగుల్.. గౌరవంగా ప్రకటించింది. 2024 ఏడాది మరికొద్ది రోజుల్లో పూర్తి కానుండటంతో గూగుల్ టాప్ 10 %చీమ్ఖతీ ఎవ% సెర్చులను రివీల్ చేసింది. ఆ లిస్ట్ లో పదో స్థానంలో "%ఙఖఅబమ్ఖఅ వీశీజఱవ చీమ్ఖతీ వీవ%" ఉంది. దీంతో ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అంతకుముందు.. 2024లో ఎక్కువ మంది ఏ మూవీ కోసం సెర్చ్ చేశారన్న లిస్టులో కూడా హనుమాన్ స్థానం సంపాదించుకుంది. ఐదో స్థానంలో హనుమాన్ మూవీ ఉంది. హనుమాన్ తో పాటు కల్కి 2898 ఏడీ, సలార్ సినిమాలు కూడా టాప్ 10 మోస్ట్ సెర్చ్డ్ మూవీస్ లిస్ట్ లో చోటు దక్కించుకున్నాయి. మొత్తానికి హనుమాన్ మూవీ.. గూగుల్ ట్రెండ్స్ లో సత్తా చాటినట్లే.

## చీరలో సంయుక్త గ్లామర్ ఘాటు

సంయుక్తా తన తాజా గ్లామర్ లుక్ తో సోషల్ మీడియా ప్రపంచాన్ని మరోసారి ఉపేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన పసుపు, పింక్ కలర్ కాంబినేషన్ చీర ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తూ కనిపిస్తోంది. చెవిపోగులు, మెడలో పూసలహారం, అలాగే కంచు బ్రాస్‌లెట్ లాంటి ఆభరణాలతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. సంయుక్తా తన ఈ లుక్ కోసం చాలా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తోంది, ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సంయుక్త ఎలా కనిపించినా అందంగానే ఉంటుందని మరోసారి నిరూపించింది. ఫ్యాషన్ డ్రెస్సులలోనే కాకుండా చీరలో కూడా తన వయ్యారంతో మైమరిపిస్తోంది. ఇక సంయుక్తా కెరీర్ విషయానికి వస్తే, ఆమె తన ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రయాణాన్ని మలయాళ చిత్రాల ద్వారా ప్రారంభించి, తెలుగు, తమిళ భాషల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో ఈమధ్య ఆమె చేసిన సినిమాలు



బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ఆమె ప్రస్తుతం స్వయంభు అనే సినిమాలో నటిస్తోంది, నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వస్తున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ పీరియాడిక్ ఫిల్మ్ ద్వారా సంయుక్తా తన నటనతో అభిమానులను ఆకట్టుకోబోతుందని పోస్టర్స్ చూస్తే అర్థమవుతోంది. ఇక సంయుక్తా తన ఫోటోషూట్ల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెను మరింత దగ్గరగా కలిపేలా చేస్తున్నాయి.ఒకవైపు ఆమె ట్రెండిషనల్ లుక్స్‌తో అభిమానులను ఆకర్షిస్తుంటే, మరోవైపు గ్లామర్ లుక్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చూపిస్తుంది. ఇక రాబోయే ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే, సంయుక్తా ప్రముఖ హీరోలతో కలిసి పలు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న మరో కీలక చిత్రం రామ్, మోహన్ లాల్ సరసన ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమా మలయాళంలోనే కాకుండా ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. అదేవిధంగా, శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ నెక్స్ట్ సినిమాలలో కూడా ఆమె మెయిన్ హీరోయిన్ గా అవకాశం అందుకుంది.

## 'పుష్ప 2' సినిమాపై సూపర్ స్టార్ పోస్ట్ పెట్టలేదేంటి?

'పుష్ప 2' హవా ఇప్పుడప్పుడే తగ్గేలా కనిపించం లేదు. వీక్ డేస్ లోనూ భారీ వసూళ్లను రాబడుతూ, బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. 5 రోజుల్లోనే ?922 కోట్లు కలెక్ట్ చేసిన ఈ చిత్రం.. ఈరోజుతో ?1000 కోట్ల మార్క్ ను క్రాస్ చేసి, అత్యంత వేగంగా ఈ ఫీట్ అందుకున్న ఇండియన్ సినిమాగా చరిత్ర సృష్టించింది. కేవలం ఒక్క హిందీలోనే ?350 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడం విశేషం. నార్త్ అమెరికాలో ఇప్పటికే %వి%10 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఇన్ని రికార్డులు క్రియేట్ చేస్తున్నా, బాక్సాఫీస్ దగ్గర ప్రభంజన సృష్టిస్తున్నా ఇప్పటిదాకా సెలబ్రిటీలు ఎవరూ ఈ సినిమాని ప్రశంసిస్తూ పోస్టులు పెట్టలేదు. టాలీవుడ్ లో ఏదైనా సినిమా హిట్టయినప్పుడు హీరోలంతా అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం మనం చూస్తుంటాం. ఈ ఏడాది 1000 కోట్ల క్లబ్ లో చేరిన 'కల్కి 2898 ఏడీ' సినిమాపై దాదాపు సినీ ప్రముఖులంతా ప్రశంసలు కురిపించారు. తెలుగు సినిమా స్టాండర్డ్స్ ని నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్ళిందంటూ కొనియాడారు. కానీ "పుష్ప 2: ది రూల్" మూవీ పాన్ ఇండియాని రూల్ చేస్తున్నా,



ఎందుకనో హీరోలెవరూ పెద్దగా స్పందించలేదు. 'పుష్ప 2' సినిమాలో అల్లు అర్జున్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. 'పుష్ప 1' చిత్రానికి బెస్ట్ యాక్టర్ గా నేషనల్ ఫిలిం అవార్డ్ అందుకున్నట్లే, సీక్వెల్ కు కూడా బన్నీ అవార్డు సాధిస్తారని ఆడియన్స్ భావిస్తున్నారు. యావత్ సినీ అభిమానులు ఆయన నటనను మెచ్చుకుంటున్నారు. ఇంకా సినిమా చూడలేదో, చూసి కూడా సైలెంట్ గా ఉన్నారో తెలియదు కానీ.. సెలబ్రిటీలు ఎవరూ దీనిపై స్పందించలేదు. రిలీజ్ కు ముందు బెస్ట్ విషెస్ అందజేసిన హీరోలు సైతం సినిమా రిలీజ్ తర్వాత మౌనం వహించడంపై ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఏదైనా సినిమా నచ్చితే వెంటనే సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ ఉంటారు. కంటెంట్ బాగుంటే, చిన్న సినిమాలను సైతం మెచ్చుకుంటూ ఎక్స్ లో రివ్యూలు పోస్ట్ చేస్తుంటారు. తనకు నచ్చితే చాలు, కొన్నిసార్లు యావరేజ్ సినిమాలను కూడా పెద్దగా పొగుడుతూ చిత్ర బృందానికి అభినందనలు తెలుపుతారు. ఇప్పుడు "పుష్ప 2: ది రూల్" సినిమా చూసి మహేష్ రివ్యూ ఇస్తారని అల్లు అర్జున్ అభిమానులు భావిస్తున్నారు. 'పుష్ప' ఫస్ట్ పార్ట్ రిలీజైనప్పుడు మహేష్ బాబు సినిమా చూసి ట్వీట్ చేశారు. "పుష్ప పాత్రలో అల్లు అర్జున్ స్టన్నింగ్, సెన్సేషనల్, ఒరిజినల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. సుకుమార్ తన సినిమా రా అండ్ రస్టిక్ గా నిజాయితీతో కూడినదని మళ్లీ నిరూపించాడు. దేవిశ్రీ ప్రసాద్.. నువ్వొక రాక్ స్టార్. మైత్రీ మూవీ మేకర్స్ టీమ్ మొత్తానికి అభినందనలు. ప్రౌడ్ ఆఫ్ యూ గైస్" అని మహేష్ పోస్ట్ చేశారు. దీనికి బన్నీతో సహా చిత్ర బృందం అంతా స్పందిస్తూ కృతజ్ఞతలు కూడా తెలిపారు.




## రైతుకు బేడీలు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది?.. సీఎం రేవంత్ సీరియస్

హైదరాబాద్: లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడిన సీఎం.. ఘటనపై ఆరా తీశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. ప్రజాప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారు. హీర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు. ఛాతీనొప్పి రావడంతో రైతు హీర్యానాయక్‌కు మొదట సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం హీర్యానాయక్ ఆరోగ్యం నిలకడగా ఉందని సంగారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు. హార్ట్ బీట్ కొంచెం తక్కువగా ఉందని, గతంలో కూడా గుండె నొప్పి వచ్చిందని చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్‌కు రిఫర్ చేశామని చెప్పారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో రైతుకు చికిత్స అందిస్తున్నారు.

**పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం :** రైతు హీర్యానాయక్‌కు గుండెనొప్పి వస్తే బేడీలు వేసి జైలు నుంచి ఆసుపత్రికి తరలించడం క్షమార్హం కాదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన వ్యక్తిని బేడీలు వేసి తీసుకురావడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. రైతులను కస్టడీలో చిత్రహింసలు పెట్టారని మేజిస్ట్రేట్ ముందు చెబితే.. కుటుంబ సభ్యులను కూడా కొడతామని బెదిరించారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట వినకపోవడమే వారు చేసిన తప్పా? అని నిలదీశారు.

**అన్నం పెట్టే రైతుకు బేడీలు వేస్తారా?: హరీశ్‌రావు...** దేశానికి అన్నం పెట్టే రైతన్నకు బేడీలు వేశారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఉన్న రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. రైతు హీర్యానాయక్ ఉగ్రవాదా? దోపిడీ దొంగా? అని ప్రశ్నించారు. రైతుల భూములు లాక్కుంటారు.. తిరగబడితే అరెస్టులు చేస్తారని ఆరోపించారు.

## మంత్రివర్గ విస్తరణ.. భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు మల్లు భట్టి విక్రమార్క ఇవాళ(గురువారం) ఢిల్లీలో అల్పాహారం ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఢిల్లీలో ఈరోజు రాహుల్ గాంధీని కలవలేదని అన్నారు. తెలంగాణలో ప్రజాపాలన పట్ల 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. వందశాతం మంది ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉంటారనుకోవడం లేదని చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అన్న తేడా లేదని స్పష్టం చేశారు. ఎవరు చెరువులను ఆక్రమించిన వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. రైతు భరోసాను సంక్రాంతి నుంచి అమలుచేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని అన్నారు. రైతులకు ఇచ్చే బోనస్‌లో రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి రైతులకు చేకూర్చుతుందని మల్లు భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధన లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ రూల్స్ మార్చారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ.64 వేల కోట్ల అసలు వడ్డీ కట్టామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ఏడాదికి రూ.6400 కోట్లు ఉంటే ఇప్పుడు ఏడాదికే రూ.64 వేల కోట్లు కట్టాల్సి వచ్చిందనిమల్లు భట్టి విక్రమార్కతెలిపారు. తమ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది అందుకే ప్రచారంలో వెనుకబడ్డమని అన్నారు. పదేళ్ల తర్వాత హాస్టళ్లకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ పాలన కంటే మెరుగైన పాలన తమ ప్రభుత్వంలో అందిస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా..

## తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: బయ్యారం ఉక్కు–తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

## మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువు నష్టం కేసు.. విచారణ వాయిదా




హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం కేసు విచారణను నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. ఇవాళ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని గత విచారణ సందర్భంగా మంత్రికి.. న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. పలు కార్యక్రమాల కారణంగా విచారణకు హాజరుకాలేక పోతున్నట్లు మంత్రి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరో తేదీ ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరగా.. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

## ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో గురువారం నుంచి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫేస్ రికగ్నిషన్‌కు సంబంధించి సీఎస్ శాంతి కుమారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఫేషియల్ రికగ్నేషన్ విధానంపైనే రోజువారి అటెండెన్స్ నమోదు చేయనున్నారు. గురువారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఇది వర్తిస్తోంది. సచివాలయం ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం నుంచి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను తప్పనిసరి చేసింది. అందులో భాగంగా ఇప్పటికే సచివాలయంలోని అన్ని విభాగాల్లో ఫేస్ రికగ్నిషన్ డిజిటల్ మిషన్లను ఏర్పాటు చేసింది. ఉద్యోగులకుసంబంధించిన ఐడీ నెంబర్లతో సహా ఫేస్‌లను మిషన్‌లో అధికారులు నమోదు చేశారు. గురువారం ఉదయం నుంచే ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యే ముందు ఫేస్ రికగ్నిషన్ మిషన్‌లో తమ అటెండెన్స్ నమోదు చేసుకుని విధులకు హాజరవుతున్నారు. ఇక నుంచి ఉద్యోగుల అటెండెన్స్, వారి జీతభత్యాల చెల్లింపులు ఈ అటెండెన్స్ ద్వారానే జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా రాష్ట్ర సచివాలయం పాలన విభాగానికి గుండెకాయ లాంటిది. అయితే కొంత మంది ఉద్యోగులు సమయానికి రావడంలేదని, ఇష్టానుసారంగా వస్తున్నారని, 12 గంటల వరకు కూడా కొంతమంది రావడం లేదని.. ఒక వేళ వచ్చినా.. సాయంత్రం 5 గంటలలోపే తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. మంత్రులు కొందరు తమ శాఖల్లోని ఆకస్మిక తనిఖీలు చేశారు.




హైదరాబాద్: సినీనటుడు మోహన్‌బాబుపై పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మీడియా ప్రతినిధిపై దాడి ఘటనలో ఆయనపై తొలుత బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదైంది. తాజాగా లీగల్ ఒపీనియన్ తీసుకున్న పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కుటుంబ వివాదం నేపథ్యంలో మంగళవారం జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసానికి మీడియా ప్రతినిధులు వెళ్లారు. ఈ క్రమంలో మోహన్‌బాబుతో పాటు వచ్చిన బౌన్సర్లు, సహాయకులు.. గేటు లోపల ఉన్న మీడియా ప్రతినిధులను బయటకు తోసేయడంతో పాటు కర్రలతో దాడిచేశారు. ఓ ఛానల్ ప్రతినిధి చేతిలో నుంచి మోహన్‌బాబు మైకు లాక్కుని ముఖంపై కొట్టారు. బౌన్సర్లు నెట్టేయడంతో ఓ ఛానల్ కెమెరామన్ కింద పడ్డాడు. ఈ నేపథ్యంలో కేసు నమోదైంది.




## ఏసీబీ కస్టడీకి నిఖేశ్ కుమార్.. నాంపల్లి కార్యాలయానికి తరలింపు

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఆయన్ను చంచల్‌గూడ జైలు నుంచి నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఏసీబీ అధికారులు నాలుగు రోజుల పాటు విచారించనున్నారు. ఆయన సమక్షంలో బ్యాంకు లాకర్లు తెరవనున్నారు. ఇప్పటికే నిఖేశ్ కుమార్ బినామీ ఆస్తుల వివరాలను అధికారులు సేకరించారు. అతడి స్నేహితుల బ్యాంక్ లాకర్ ఓపెన్ చేసి భారీగా బంగారంతో పాటు కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నీటిపారుదల శాఖలో ఏఈఈగా పనిచేస్తూ ఇటీవల అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కిన నిఖేశ్‌కుమార్ రోజుకు తక్కువలో తక్కువ రూ.2లక్షలపైగా సంపాదించాడు. ఉద్యోగంలో చేరిన అనతి కాలంలోనే అడ్డగోలు సంపాదనకు రుచి మరిగిన నిఖేశ్‌కుమార్‌తోపాటు సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ బృందాలు చేసిన దాడిలో రూ.17.73 కోట్ల అక్రమాస్తులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఒక లాకర్‌లో మరో కిలోన్నర బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. వీటన్నింటి విలువ బహిరంగ మార్కెట్‌లో అథమపక్షం రూ.100 కోట్లపైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆయన ఉద్యోగంలో చేరి పదేళ్లవుతోంది. ఈ క్రమంలో అతడి అక్రమార్జన గురించి లెక్కగడితే సగటున రోజుకు రూ.2 లక్షలకు తక్కువ కాకుండానే ఉన్నట్లు తేలుతోంది. ఇంత భారీగా కూడబెట్టేందుకు నిఖేశ్‌కుమార్ ఎలాంటి కుయుక్తులకు పాల్పడ్డాడనేది తేల్చేపనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. ఆయన మరెవరికైనా బినామీగా వ్యవహరించాడా అనే విషయాన్నీ తేల్చే ప్రయత్నంలో ఉన్నారు.

## సీఎం రేవంత్ ఆ కేసులు వాపస్ తీసుకోవాలి



నందినగర్: లగచర్ల విషయంలో రేవంత్ రెడ్డి తన కిరీటం పడిపోయినట్లు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. బేషజానికి పోకుండా లగచర్ల కేసులు ఎత్తేసి.. రైతులను విడుదల చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఇవాళ( గురువారం) నందినగర్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ఈగోకు పోవటంతో.. గిరిజన రైతుల ప్రాణాలకు మీదకొచ్చిందని అన్నారు. జైల్లో ఉన్న హీర్యానాయక్‌కు గుండెపోటు వస్తే.. కుటుంబ సభ్యులకు తెలియనీయకుండా ఉంచటం దారుణమని అన్నారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని అంబులెన్స్‌లో తీసుకురాకుండా.. బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకురావటం అమానవీయమని చెప్పారు. తీవ్రవాదులకు మాత్రమే బేడీలు వేయాలన్న నిబంధన ఉందని.. రైతులకు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బేడీల అంశాన్ని గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జోక్యం చేసుకుని .. కేసులు వాపస్ తీసుకునేలా రేవంత్‌రెడ్డిను మందలించాలని అన్నారు. లగచర్ల రైతులు జైల్లో మగ్గుంతుంటే.. రేవంత్ జైపూర్ విందులు, వినోదాల్లో మునుగుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రెస్టేజ్‌కి పోయి పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయించారని మండిపడ్డారు. అదానీ, అల్లుడు కోసం పేదల భూములను రేవంత్ రెడ్డి గుంజుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అనే అహంకారితో గిరిజన, దళిత రైతులు నెల రోజుల నుంచి జైల్లో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హీర్యానాయక్ , రాఘవేంద్ర, బసప్పకు అనే రైతుల ఆరోగ్యం క్షీణిస్తోందన్నారు. తనమీద దాడి జరగలేదని స్థానిక కలెక్టర్ హుందాగా వ్యవహరించారని చెప్పారు. రైతుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని స్వయంగా కలెక్టర్ దాడి జరగలేదని చెబుతున్నారని అన్నారు. లగచర్ల రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మానవీయకోణంలో నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ తెలిపారు.


**కలెక్టర్‌పై దాడి ఎలా జరిగిందంటే..** కాగా.. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, పోలేపల్లిలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై గ్రామస్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నేతలతోపాటు పలువురిపై పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేశారు. జిల్లా కలెక్టర్‌పై దాడికి దిగేలా ప్రజలను రెచ్చగొట్టిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. నిందితుడు పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు సురేశ్ అని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దాడి జరిగే సమయానికి ముందు పట్నం నరేందర్ రెడ్డితో పదుల సంఖ్యలో ఫోన్ కాల్ చేసి సురేశ్ మాట్లాడినట్లు పోలీసులు తెలిపారు. ఇక పట్నం నరేందర్ రెడ్డి సైతం.. ఓ వైపు సురేశ్‌తో మాట్లాడుతూనే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో ఫోన్లో మాట్లాడినట్లు తెలుస్తోంది.

ఈ అంశాన్ని వెలుగులోకి తీసుకు వచ్చేందుకు డీజీపీ ఇప్పటికే సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. పట్నం నరేందర్ రెడ్డికి ప్రధాన అనుచరుడుగా ఉన్న సురేశ్‌పై ఇప్పటికే అత్యాచారం కేసుతో సహా వివిధ కేసులు సైతం నమోదయ్యాయి. అయితే గతంలో సురేష్‌పై నమోదు అయిన కేసులను తొలగించేందుకు పట్నం నరేందర్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో బహిర్గతమైంది.

**పట్నం మహేందర్ రెడ్డికి రిమాండ్...** కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామం ఘర్షణల వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్ రెడ్డికి 14 రోజుల రిమాండ్ విధించింది కోర్టు. అయితే, ఈ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. పోలీసుల రిమాండ్ రిపోర్ట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరును కూడా ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో కేటీఆర్‌తో పాటు.. మరికొందరి ఆదేశాలు కూడా ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు పోలీసులు. రైతులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టారని రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టం చేశారు.

నరేందర్ రెడ్డి తన అనుచరుడు భోగమోని సురేష్ ద్వారా ప్రజలను ప్రభావితం చేశారని పేర్కొన్నారు. అంతేకాదు.. కొందరికి డబ్బులు ఇచ్చి మరీ దాడికి ఉసిగొల్పారన్నారు. అధికారులను చంపినా పర్వాలేదని.. రైతులకు పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారని పోలీసుల రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. దాడికి పాల్పడిన కొందరిని అదుపులోకి తీసుకుని విచరించామని పోలీసులు అన్నారు. నిందితుడు విశాల్‌తో పాటు గ్రామంలో కొంతమంది సాక్షుల విచారణలో ప్రధాన కుట్రదారుడిగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిగా తేలిందని చెప్పారు.

## భద్రాచలం రామయ్య భక్తులకు గుడ్‌న్యూస్.. ఆన్‌లైన్‌లో ఉత్తరద్వార దర్శనం టికెట్లు..



భద్రాచలం : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో 31 నుంచి ప్రారంభమయ్యే వైకుంఠ ఏకాదశి మహెూత్సవాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్ల సదుపాయం కల్పించినట్టు ఆలయ ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల ధరలు రూ. 2000, రూ.1000, రూ.500, రూ.250 చొప్పున నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనానికి హాజరుకాలేని భక్తుల సౌకర్యార్థం రూ.2000, రూ.1000తో https:// bhadradritemple. tela ngana.gov.in వెబ్‌సైట్ ద్వారా బుధవారం ఉదయం 11 గంటల నుంచి బుకింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు 25 నుంచి జనవరి 10న ఉదయం 5 గంటల వరకు తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com